


### లిక్కర్ కుంభకోణంలో

# సిట్ అధికారుల తనిఖీలు

**చెవిరెడ్డి ఇంట్లో కుటుంబ సభ్యులు లేకపోవడంతో వెనుతిరిగిన అధికారులు**

**చిత్తూరు వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి ఇంటిలో విస్తృతంగా తనిఖీలు**




చెవిరెడ్డి ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో బయటవేచివున్న సిట్ అధికారులు, అధికారులు తనిఖీ చేస్తున్న విజయానందరెడ్డి ఇల్లు

మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వగృహంలో సిట్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయడానికి రాగా. చెవిరెడ్డి కుటుంబ సభ్యులు అందుబాటులో లేనందున, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు వెనుతిరిగారు. అదేవిధంగా లిక్కర్ కుంభకోణంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డికి లింకులు వున్నాయని నిర్ధారణకు వచ్చిన సిట్ ప్రత్యేక బృంద అధికారులు బుధవారం చిత్తూరులోని ఎంసి విజయానందరెడ్డిలో విస్తతంగా ఇంట్లో తనిఖీలు చేపట్టారు.

తిరుపతి రూరల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వగృహంలో సిట్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయడానికి రాగా. చెవిరెడ్డి కుటుంబ సభ్యులు అందుబాటులో లేనందున, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు వెనుతిరిగారు. బుధవారం 11:30గంటల సమయంలో సిట్, విజిలెన్స్ అధికారులు తుమ్మల గుంటలో ఉన్న చెవిరెడ్డి ఇంటికి తనిఖీ చేయడానికి విచ్చేసారు. మద్యం కుంభకోణంతో పాటు తుడ నిధుల దుర్వినియోగంపై కూడా తనిఖీలు చేయడానికి అధికారులు వచ్చినట్లు సమా చారం. ఇంటివద్ద ఎవరూ లేకపోవడంతో సెక్యూరిటీని తాళాలు తీయాలని ఆదేశించగా, తమ వద్ద తాళా లు లేవని చెప్పడంతో సాయంత్రం 4:30గంటల వరకు చెవిరెడ్డి గృహం వద్ద వేచిచూసి వెనుతిరి గారు. సిట్, విజిలెన్స్ అధికారులు తిరుపతిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి,

**సిట్, విజిలెన్స్ అధికారులతో మాట్లాడిన మోహిత్‌రెడ్డి**

నేను, మాకుటుంబ సభ్యులు బయటకు వెళ్ళామని, తిరిగి వచ్చాక మీకు ఎలాంటి సమాచారం ఇవ్వడానికైన సిద్దమేనని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సిట్, విజిలెన్స్ అధికారులకు ఫోన్‌లో తెలియ జేసినట్లు సమాచారం. సిట్, విజిలెన్స్ అధికారులు చెవిరెడ్డి ఇంటికి వచ్చారనే సమాచారంతో స్థానిక వైసిపి నాయకులు చెవిరెడ్డి ఇంటివద్ద గుమికూడారు. తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, భానుకుమార్‌రెడ్డి తదితరులు వచ్చినట్లు సమాచారం.

**విజయానందరెడ్డి ఇంట్లో సిట్ అధికారుల తనిఖీలు**

చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

లిక్కర్ కుంభకోణంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయా నందరెడ్డికి లింకులు వున్నాయని నిర్ధారణకు వచ్చిన సిట్ ప్రత్యేక బృంద అధికారులు బుధవారం చిత్తూరులోని ఎంసి విజయానందరెడ్డి ఇంటిలో బుధవారం సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సిట్ ప్రత్యేక బృందం తనిఖీలు చేస్తూనే వున్నారు. గత వైకాపా ప్రభుత్వం అధికారంలో వున్న ఐదేళ్ళలో పెద్ద ఎత్తున లిక్కర్ కుంభకోణంకు పాల్పడిందని భావించి రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మద్యం కుంభకోణంపై దర్యాప్తు చేపట్టడానికి ప్రత్యేక సిట్ బృందంను ఏర్పాటు చేసింది. ఈ సిట్ ప్రత్యేక బృందం ఇప్పటికే చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిని అరెస్టు చేయడంతో వారిద్దరు ప్రస్తుతం జైలులో రిమాండ్‌లో వున్నారు. అలాగే మద్యం కుంభకోణంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రమేయం వుందని భావించిన సిట్ ప్రత్యేక బృందం ఆయనను సైతం విచారణ చేస్తున్నారు. ఇటీవల మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామిని సిట్ అధికారులు దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో సిట్ అధికారులు పక్కా సమాచారంతో ఎంసి విజయానందరెడ్డికి లింకులు వున్నాయని భావించి బుధవారం సిట్ అధికారులు ఆయన ఇంటిని చుట్టుముట్టారు. గత ప్రభుత్వంలో విజయానందరెడ్డి మద్యం డిపోల నుండి మద్యం షాపులకు మద్యం సరఫరా చేయడానికి వాహనాలు ఏర్పాటు చేసే కాంట్రాక్టర్ అని, ఈ క్రమంలో సిట్ అధికారులు విజయానందరెడ్డి ఇంటిలో ఆధారాల కోసం తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం.



రథం ముందు పిండి తలిగలు పైవేద్యంగా వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

# కమనీయం వరసిద్దుని రథోత్సవం

## -కిక్కిరిసిన భక్తజన సందోహం



కోలాట బృందంతో కలిసి కోలాటాలు వేస్తున్న ఈవో పెంచ లకిషోర్ దంపతులు

కాణిపాకం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఈకార్యక్రమానికి కీ॥శే॥ శ్రీ కె.ఎత్తిరాజులు నాయుడు, కాకర్లవారిపల్లె వారి జ్ఞాపకార్థం వారి కుమార్తె శ్రీమతి కె.మీనాకుమారి, కీ॥శే॥ ఎన్.శివప్రసాద్ నాయుడు దంపతులు, శ్రీ కె. పూర్ణచంద్రారెడ్డి, మాజీ వి.ఎం.కాణిపాకం, కీ॥శే॥ శ్రీ కె.చంద్రశేఖ రరెడ్డి, మాజీ వి.ఎం. వారి జ్ఞాపకార్థం వారి కుమారులు కె.హరిప్రసాద్‌రెడ్డి, కాణిపాకంలు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉదయం దేవస్థానం వారిచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి చందనాలంకారం చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలం కార మండపంలో వుంచి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఉత్సవమూర్తులను ఆలయం నుండి తీసుకువచ్చి శోభాయమానంగా అలంకరించిన స్వామివారు ఊరేగే రథంపై అధిరోహింపజేశారు. ఈసందర్భంగా స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం అశేష భక్తజనం గణేష్ నామస్మరణల నడుమ ఉదయం రథంను కొంత దూరం లాగి వదిలిపెట్టారు. ఈసందర్భంగా భక్తులు రథంపై భక్తులు బొరుగులు, మిరియాలు చల్లి మొక్కులను తీర్చుకున్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు ఉత్సవ ఉభయదారులు వరుస ఉభయ తీసుకురాగా రథానికి అర్చకులు మరోమారు ప్రత్యేక పూజలు నిర్వహించి పదాతి దళాలు,విచిత్ర వేషదారణలు, రాజరిక వేషదారణ, డప్పు వాయిద్యం, కోలాటాలు, చెక్కభజనలు, పిల్లన గ్రోవి, డ్రమ్స్ వంటి వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు ముందుకు సాగుతుండగా 'జైభోలో గణేష్ మహరాజ్‌కీ జై' జై గణేశా,జైజై గణేశా అంటూ భక్తుల గణేష్ నామస్మరణలు మిన్నం టుతుండగా స్వామివారి రథం కాణిపాకం పురవీధుల్లో ముందుకు సాగింది. రథోత్సవాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాలనుండి అశేషంగా తరలి వచ్చిన భక్తజనంతో కాణిపాకం పురవీధులన్ని పోటెత్తాయి. చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, స్థానిక ఎస్సై నరసింహులుల ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఈఈ పెంచల కిషోర్ దంపతులు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, ధనుం జయ,హరిమాధవరెడ్డి సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి,ఎంపీటీసీ లీలా సుధీర్,ఆలయ మాజీ ఛైర్మన్‌లు మణినాయుడు, జగన్నాధరెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా పలువురు దాతలు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. బుధవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత ప్రసాదాల పంపిణీ కార్యక్రమంను ఈఓ పెంచల కిషోర్ ప్రారంభించారు. అలాగే ఆలయం వద్ద, కాణిపాకం-అగరంపల్లె రహదారిలో వేలాదిమంది భక్తులకు పలువురు దాతలు ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ రకాల ప్రసాదాలను,మజ్జిగ, నీళ్ళ ప్యాకెట్, పళ్ళరసాలను పంపిణీ చేశారు.దీనితో పాటు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన భవన్ వద్ద ఉదయం నుండి రాత్రి

# ఆర్టీసి తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి పిఓగా చాందిని



తిరుపతి(రవాణ),సెప్టెంబర్ 3ప్రభాతవార్త:

ప్రజారవాణాశాఖ తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి పిఓగా పి.చాందిని బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇదివరకు తిరుపతి డిపోలో అసిస్టెంట్ ఇంజనీర్ మెకానికల్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ పిఓగా ఉన్న ఆర్.షహజాద్ చిత్తూరు జిల్లా పిఓగా బదిలీపై వెళ్ళారు.

# లాభాపేక్షలేకుండా కొండపై బిగ్, జనతాక్యాంటీన్లు సేవలు

**-శ్రీవారిసేవకుల గ్రూప్‌సూపర్‌వైజర్స్‌కు నూతనసాఫ్ట్‌వేర్**

**-టిటిడి ఛైర్మన్,ఈఓ,అదనపు ఈఓ**

తిరుమల,సెప్టెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవారి భక్తులకు నాణ్యతతో రుచికరమైన ఆహారపదార్థాలు అందించేందుకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా పెద్ద,జనతాక్యాంటీన్ల నిర్వహణకు బ్రాండెడ్ హోటళ్ళ యాజమాన్యం సేవాభావంతో ముందుకు వచ్చినట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఇందులో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదని, టిటిడి నియమనిబంధనల మేరకు బ్రాండెడ్ హోటళ్ళకు అప్పగించడం జరిగిందన్నారు. బిగ్,జనతా క్యాంటీన్ల నిర్వహణకు టిటిడి నూతన విధానాన్ని రూపొందించి అందుకు అనుగుణంగా నిపుణుల కమిటీ ఆహారపదార్థాల ప్రమాణాలు ,ఇతర అంశాలను పరిశీలించిందని చెప్పారు. బుధవారం సాయంత్రం టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ నాయుడు తిరుమలలో శ్రీవారిసేవకుల సేవల విస్తరణ, క్యాంటీన్ల కేటాయింపు,భక్తుల క్యూలైన్ల నియంత్రణ, సౌకర్యాలు మెరుగుపరచడం అంశాలపై అన్నమయ్యభవనంలో మీడియాకు వెల్లడించారు. తిరుమలకు వస్తున్న భక్తులకు మెరుగైన సేవలందించేందుకు శ్రీవారిసేవకులకు గ్రూప్ సూపర్‌వైజర్ల(సమూహ పర్యవేక్షకులు ), ట్రైనర్స్‌తో నిరంతరం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం నూతన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్లు నాయుడు తెలిపారు. సిఎం చంద్రబాబు సూచనలమేరకు శ్రీవారిసేవలో మార్పులు తీసుకువచ్చామన్నారు. ఈఓ శ్యామలరావు మాట్లాడుతూ క్యూలైన్లు నిర్వహణ,పారిశుధ్యం, కల్యాణకట్ట, లగేజీ కౌంటర్లు, అన్నప్రసాదాలు శ్రీవారిసేవకులతో నిరంతరాయంగా పంపిణీ చేస్తున్నామన్నారు. లడ్డూప్రసాదం ,నాణ్యత రుచిపై భక్తులనుండి ప్రశంసలు అందుతున్నట్లు ఈఓ తెలిపారు. శ్రీవారిసేవకుల శిక్షకులకు ఐఐటి అహమ్మదాబాద్ నిపుణులతో శిక్షణ ఇచ్చేందుకు టిటిడి చర్యలు చేపట్టిందన్నారు. అదనపు ఈఓ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ పారదర్శకంగా తిరుమలలో బిగ్, జనతా క్యాంటీన్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇందుకోసం నూతన పాలసీ తయారుచేసి, నిపుణుల కమిటీతో ఆయా సంస్థల కార్యకలాపాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత కలిగిన సంస్థలకు మాత్రమే క్యాంటీన్లు కేటాయించడం జరిగిందని చౌదరి తెలిపారు.శ్రీవారి భక్తుల అవసరాలకు అనుగుణంగా ప్రస్తుతం పది బిగ్ క్యాంటీన్లు,ఆరు జనతా క్యాంటీన్లు ఉన్నాయన్నారు.

# తిరుపతి తెలుగుతమ్ముళ్ళకు నిరాశే!

## 11 కార్పొరేషన్‌ల డైరెక్టర్ పదవుల్లోనూ బలాదూర్



తిరుపతి,సెప్టెంబర్ 3ప్రభాతవార్త:

పార్టీకోసం కష్టపడినవారికి పదవులు ఇస్తానని స్వయంగా ప్రకటనచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంతజిల్లాలో తిరుపతి నియోజకవర్గ తెలుగుతమ్ముళ్ళకు నిరాశే ఎదురైంది. ఇప్పటికే దాదాపు అన్ని కార్పొరేషన్ల ఛైర్మన్ పదవులు భర్తీచేసిన కూటమి ప్రభుత్వం తాజాగా బుధవారం సాయంత్రం 11 కార్పొరేషన్లకు 120మంది డైరెక్టర్ పదవులను నేతలకు కట్టబెట్టారు. ఈ డైరెక్టర్ పదవులు తిరుపతి తెలుగుతమ్ముళ్ళకు పూర్తిగా మొండిచేయి చూపారనే విమర్శలు వినిపిస్తున్నాయి పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా తిరుపతికి చెందిన సీనియర్‌నాయకురాలు మాజీఎమ్మెల్యే ఎం.సుగుణమ్మను నియమించిన చంద్రబాబు దానికి అనుబంధంగా 14మంది డైరెక్టర్ పదవులు బుధవారం భర్తీచేసింది. ఈ పదవులు తిరుపతి నేతలకు దక్కలేదు. ఇక ఏపి విద్య సంక్షేమం మౌళికవసతుల కల్పన అభివృద్ధి కార్పొరేషన్‌కు 14 డైరెక్టర్ పదవులు భర్తీచేశారు. ఇందులో తిరుపతి పార్టీనేతలకు కనీసం ఒక్క డైరెక్టర్ పదవి ఇవ్వకపోవడం వెనుక తిరుపతి నేతలు పార్టీలో నామమాత్రమేననేది అధిష్టానం అంచనా. రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఏపి లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, కుమ్మరిశాలివాహన వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నాటక అకాడమీ,స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్‌కార్పొరేషన్ ,స్టేట్ అగ్రికల్చర్ మిషన్, గ్రంధాలయ పరిషత్, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ప్రదాన కీలక కార్పొరేషన్‌లైన వీటిల్లో తిరుపతికి చెందిన టిడిపి నేతలకుగానీ, ద్వితీయశ్రేణి నాయకులు, సీనియర్ కార్యకర్తలకు కనీసం అవకాశం దక్కకపోవడం వారి పనితీరు వైఫల్యమే కారణమనేది టిడిపి అధిష్టానం దృష్టిలో ఉంది. దీంతో తిరుపతి తెలుగుతమ్ముళ్ళకు రానున్న రోజుల్లోనూ పూర్తిగా పదవులు దక్కేఅవకాశాలు తక్కువేనని పార్టీలో గుసగుసలు మొదలయ్యాయి. ఇంకా కొన్ని ఆలయాల పాలకమండళ్ళ ఛైర్మన్ పదవులను కూడా టిడిపి వారికి లేవనేది కూటమి పార్టీల్లో కొందరు వ్యాఖ్యలు .

# బాధ్యతగా విధులు నిర్వహణ

**- 15వ ఆర్థిక సంఘ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**- ఎంపిడిఓలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ దిశా నిర్ధేశం**



చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయిలో బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రజల సమస్యలను పరిష్కరించడానికి పక్కాగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎంపిడిఓలను ఆదేశించారు. జడ్పీ సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టాల్సిన పనులపై ఎంపిడిఓలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌళిక సౌకర్యాలు కల్పించడానికి ఎంపిడిఓలు పక్కాగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నిధులతో చేపట్టే పనులు నాణ్యతగా చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయిలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామ సర్పంచ్‌లతో చర్చించి స్థానిక ప్రజాప్రతనిధుల దృష్టికి తీసుకెళ్ళి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, కిచెన్ షెడ్లు, ఆర్ఓ ప్లాంట్లు, సిసి రోడ్లు తదితర పనులు మండలాల్లో ఎలా చేస్తున్నారని కలెక్టర్ ఈ సమావేశంలో ఎంపిడిఓలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 23 పనులు పెండింగ్‌లో వున్నాయని, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 119 పనులు పెండింగ్‌లో వున్నాయని వీటిని త్వరితంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్, జడ్పీ డిప్యూటీ సిఇఓ వెంకటనారాయణ, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

# గుత్తివారిపల్లెలో హెల్త్ ఎమర్జెన్సీ ?

**ప్రబలిన అతిసార వ్యాధి.**

**40 మందికి అస్వస్థత.... వృద్ధురాలు మృతి....**



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

రేణిగుంట సెప్టెంబర్ 3 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గుత్తివారిపల్లె గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలడంతో హెల్త్ ఎమర్జెన్సీ ని తలపిస్తుంది. సుమారు 40 మంది డయేరియా వ్యాధి బారిన పడ్డారు. వీరిలో తిరుపతికి చెందిన గుత్తి సుభద్రమ్మ (80) మృతి చెందింది. 20 మంది రేణిగుంట విమానాశ్రయ మార్గంలోని శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్నారు. వీరికి ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి సూచనలు మేరకు ఆసుపత్రి సూపరింటెడెంట్ డాక్టర్ వీరస్వామి పర్యవేక్షణలో డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ సాయి కార్తీక్,డాక్టర్ లహరి తదితర వైద్య బృందం జేఈఓ డాక్టర్ నవీన్ కుమార్ రెడ్డి, హెచ్ఆర్ నాగరాజు సమక్షంలో వైద్య సేవలు అందిస్తున్నారు. మరొకరు గుత్తి వారి పల్లె గ్రామంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులో చికిత్స తీసుకుంటున్నారు. కొంతమంది వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతుండగా ఇంకొంతమంది ఇంటి వద్ద మందులు వాడుతున్నారు. అధికార యంత్రాంగం గుత్తివారిపల్లె గ్రామానికి, శ్రీ బాలాజీ మెడికల్ కళాశాల ఆసుపత్రికి వద్దకు పరుగులు పెట్టారు. జిల్లా పంచాయితీ అధికారిని సుశీలదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ గుత్తి వారి పల్లె గ్రామం చేరుకుని పరిస్థితులపై ఆరా తీశారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు ఒకరోజు సెలవు ప్రకటించారు. రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది హుటాహుటిన గుత్తివారిపల్లె గ్రామం లో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి గ్రామానికి, శ్రీ బాలాజీ ఆసుపత్రికి వెళ్లి వ్యాధిగ్రస్తులను పరామర్శించారు. ఎంపీడీవో ప్రభురావు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చక్రపాణి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గుత్తి వారి పల్లె నందు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యులను కోరారు.

ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం గ్రామం, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన అనంతరం మాట్లాడుతూ ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం అన్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చికిత్స పొందుతున్న వారికి పండ్లు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అంద జేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో పాటు తిరుపతి పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, జిల్లా టిడిపి రైతు నాయకుడు మునిస్వామి నాయుడు, బిజెపి మండల అధ్యక్షుడు పూజారి ప్రేమ్ కుమార్ ఉన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం తో అడ్వకేట్ తిరుమల రెడ్డి, పలువురు వన్నెకుల క్షత్రియ నేతలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో డిసిసిబి మాజీ ఛైర్మన్ సిద్దాగుంట సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరుమలరెడ్డి, రేణిగుంట మండల వైసిపి అధ్యక్షుడు గంగారి రమేష్ తదితరులు ఉన్నారు



## స్వచ్ఛకుప్పం సాధనకు సహకరించాలి : క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్



**కుప్పం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** సిఎం చంద్ర బాబునాయుడు పిలుపు మేరకు స్వచ్ఛకుప్పం సాధనకు ప్రజలు సహకరించాలని 11 క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్ కోరారు. బుధారం మున్సిపల్ పరిధి డికెపల్లిలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రజల ఇళ్ల నుంచి పొడి చెత్తను సేకరించి వాటి విలువకు తగ్గట్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కమీషనర్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఐటిసి సంస్థసహకారంతో తడి,పొడి చెత్తను సేకరిస్తూ ప్రజలకు ప్రోత్సాహకంగా నిత్యావసరాలు అందించడం జరుగుతోందన్నారు. అన్ని వార్డుల్లో ఇ- ఆటోల ద్వారా చెత్తను సేకరిస్తున్నట్లు తెలిపారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్ మాట్లాడుతూ గతంలో వైకాపా ప్రభుత్వం చెత్తపై పన్ను వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం చెత్త సేకరించి ప్రజలకు సరుకులు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కో క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమగళ్, మాజీ సర్పంచ్ డికెపల్లి మణి, ఎఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్, నేతలు నబీ ఉల్లా, సోమశేఖర్, బాబు పాల్గొన్నారు.

## ఉదయమాణిక్యంలో శ్రీజ పాలశీతలీకరణ ప్రారంభించిన సీఈవో

*యర్రావారి పాలెం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త*



యర్రావారిపాలెం మండల కేంద్రంగా ఉదయ మాణిక్యంలో పాడి రైతుల అభివృద్ధి దిశగా శ్రీజ కంపెనీ మరో ముందడుగు వేసింది. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన పాలశీతలీకరణ కేంద్రాన్ని కంపెనీ సీఈఓ తిమ్మప్ప ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తిమ్మప్ప మాట్లాడుతూ యర్రావారిపాలెం మండలంలో పాడి పరిశ్రమ అధికంగా ఉన్నందున, పాడి రైతుల కోరిక మేరకు పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటుతో పాల ఉత్పత్తుల నిల్వ, శీతలీకరణ సదుపాయం లభించడం ద్వారా మరింత ఆదాయం కలుగుతుందన్నారు. పాల నాణ్యత కూడా మెరుగవుతుందని, రైతుల అభివృద్ధి, పాలు ఉత్పత్తిలో నాణ్యత పెంపు, స్థానికులకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా ఈ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. భాకారపేట మేనేజర్ కె.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులకు నిత్యవసరమైనటువంటి పశువుల దాన, పశువులకు వైద్య సదుపాయాలు, సబ్సిడీలో పాడి రైతులకు అవసరమైనటువంటి సదుపాయాలను శ్రీజ డైరీ ఆధ్వర్యంలో సమకూరుస్తూ పాటి రైతులకు అండగా ఉంటున్నామని తెలియజేశారు. భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలోని ఏరియా టీమ్ ప్రత్యేకంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా పాడి రైతులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా యర్రావారి పాలెం మండల తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు కొమ్మిక లక్ష్మీదేవి, కూటమి నాయకులు శ్రీజ డైరీ ప్రతినిధులు ప్రొక్యూర్మెంట్ హెడ్ రాజేంద్ర బాబు, హెచ్ఆర్. హెడ్ రవికుమార్, మాన్యుఫాక్చరింగ్ హెడ్ మస్తాన్ రెడ్డి, ఏజీఎం రామనాధం, హెచ్ఆర్. భాస్కర్ రెడ్డి, శ్రీజ డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, కట్టి, మురళి, రాజు, తులసీరామ్, యుగంధర్, రామకృష్ణ, రవి, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని హేమలతా శ్రీ

పుంగనూరు సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా పుంగనూరు పట్టణానికి చెందిన హేమలత శ్రీ ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. పుంగనూరు పురపాలక సంఘం ఉపాధ్యాయినిగా స్థానిక రాంనగర్ మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న హేమలత శ్రీ విధి నిర్వహణపట్ల అంకితభావంతో పని చేయడంతో ఆమెకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు దక్కినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆమె విజయవాడలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సత్కరింపబడి అవార్డు అందుకోనున్నారు. నూతన విద్యా విధానంలో విద్యార్థులకు బోధనలో మెలకువలతో పాటు ఆమె దైనందిక జీవితంలో ఉత్తమ కవయిత్రిగా కూడా రాణిస్తున్నారు. గజల్ సాహిత్య రంగంలో ఆమె ఇటీవల మంచు పూలు గజల్ సంకలనాన్ని కూడా తీసుకువచ్చారు. హేమలత శ్రీ కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు లభించడం పట్ల మున్సిపల్ చైర్మన్ అలీం బాషా, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల విద్యాశాఖ అధికారి తో పాటు పుంగనూరు రచయితల సంఘం అధ్యక్షుడు నాగరాజ పరాంకుశ, సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

## ఫిర్యాదు స్వీకరించడం లేదని ఎస్ఐపై ఆరోపణ



**సత్యవేడు, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** సత్యవేడు మండల పరిధిలోని రాజుగుంట గ్రామ పంచాయతీలోచోటుచేసుకున్న సంఘటన ఇలా తమపై దాడికిపాల్పడిన వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని తామిచ్చిన ఫిర్యాదును పట్టించుకోకుండా, తమపైనే కేసు నమోదు చేశారని సత్యవేడు ఎస్ఐ రామస్వామిపై ఏఎం పురంకు చెందిన మహిళ మల్లిక ఆరోపణ వ్యక్తం చేశారు. ఆమె తెలిపిన వివరాల మేరకు... తన కుమారుడు షేక్ షరీఫ్ డ్రైవర్‌పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడని, ఈ క్రమంలో ఆదివారం లారీ తీసుకుని ఇంటికి వస్తుండగా వీధి మలుపు వద్దగ్రామానికి చెందిన పుష్ప అనే మహిళ ఇంటికి గోడకు లారీ,తగిలి కొన్ని రాళ్లు తొలగిపోయాయి. దీంతో ఆగ్రహం చెందిన పుష్ప సోదరుడు అల్లా స్వామిరెడ్డి షరీఫ్‌ని నానా దురభాషాలతో దూషించాడు. దీంతో షరీఫ్ జరిగిన దానికి నేను బాధ్యత వహిస్తానని, కొత్త దిమ్మి కట్టిస్తానని చెబుతున్నా వినిపించుకోకుండా హింసాత్మక పదజాలంతో దూషించాడు. అంతటితో ఆగకుండా ఇంటికి వెళ్లిన అల్లాస్వామిరెడ్డి అతని కుమారులు చిరంజీవి, దిలీప్‌వారి బంధువులు చరణ్, చంద్రశేఖర్, సురేష్, జనసేన నాయకులు సాయి, రాఘవేంద్ర, సుబ్రహ్మణ్యం, మంజులమ్మ పుష్ప 30 మందికి పైగా వారి బంధువులను తీసుకొచ్చి తమ ఇంటిపై మూ కుమ్మడిగా దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఆమెతో పాటు ఆమె కోడళ్ల రజియ,సమయా భానులను మహిళలను చూడకుండా బండ బూతులు తిడుగూ దాడికి దిగి, మా ఇంటిపైకి రాళ్లు విసిరి, ఇంటికి కిటికీలు, తలుపులను పగులగొట్టి ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారని తెలిపారు. ఈ ఘటనలో గ్రామ సర్పంచ్ శిరీష భర్త శ్రీనివాసులరెడ్డి ప్రత్యక్షంగా పాల్గొని ఊరిలో వారిని రెచ్చగొట్టి మాపై జరుగుతున్న దాడిని మరింత ప్రోత్సహించాడని ఆరోపించారు. ఈ విషయమై న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. మాపై దాడి చేసిన వారికే వత్తాసు పలుకుతూ తిరిగి మాపైనే కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఐ రామస్వామిని వివరాలు కోరగా ఇరు వర్గాలపైన కేసు నమోదు చేస్తామని తెలియజేశారు.

## పక్కా ప్రణాళికలో సింగిల్‌విండోలు ఆర్థిక బలోపేతంకు కృషి

– సింగిల్‌విండో అధ్యక్షుల అవగాహన సమావేశంలో డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి



**చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** పక్కా ప్రణాళిక రూపొందించుకుని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సింగిల్‌విండో)లను ఆర్థికంగా బలోపేతం చేయడానికి నూతనంగా నియమితులైన సింగిల్‌విండో ఛైర్మన్లు కృషి చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డిసిసిబి కార్యాలయంలోని సమావేశభవనంలో బుధవారం డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో నూతనంగా నియమితులైన సింగిల్‌విండో ఛైర్మన్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సింగిల్‌విండోల పరిపాలన నిర్వహణలో సర్వధికారి అధ్యక్షుడని, సిఇఓ ఆధ్వర్యంలో వున్న సంఘ ఆస్తులు, నగదు తదితర నిల్వను అధ్యక్షుడు పర్యవేక్షించాలన్నారు. సిఇఓ లేని సమయంలో సంఘ పుస్తకాలను నిర్వహించాల్సిన బాధ్యత అధ్యక్షుడేదనన్నారు. సంఘ పరిధిలో వసూలైన రుణ వసూళ్లను 48 గంటల్లోపు ఫైనాన్సింగ్ బ్యాంకులో జమ చేయాల్సివుంటుందని, అలాగే సంఘ సిబ్బందికి జీత భత్యాల చెల్లిపు పేబిల్ రిజిస్టర్‌లో అనుమతి మంజూరు చేసి ఆపై మార్జిన్ ఖాతా నుండి మాత్రమే చెల్లింపులు చేయాలని స్పష్టం చేశారు. అలాగే సెక్షన్–21 కింద అనర్హతకు గురైన సభ్యులు, పాలకవర్గ సభ్యులను తొలగింపుకు సిఫార్సు చేయవచ్చునని, అలాగే రుణాలు, డిపాజిట్ల రూపంలో నిధులు సేకరించి వాటిని పెట్టుబడిగా పెట్టవచ్చునన్నారు. వార్షిక బడ్జెట్ కేటాయింపులకు లోబడి సంఘ వ్యాపారానికి అవసరమైన వ్యయము మంజూరు చేయాలని, చట్టంలో పేర్కొన్నట్లు సాధారణ సమావేశాలు నిర్వహించాలన్నారు. జిల్లా సహకార అధికారి లక్ష్మీ మాట్లాడుతూ ఆర్థిక, అంతర్గత పరిపాలనాపరమైన విషయాల్లో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, నాబార్డు మార్గదర్శకాలకు లోబడి మహాజనసభకు ఆమోదం లేదా అనుమోదము తెలపవచ్చునన్నారు. అలాగే సెక్షన్–50 కింద ఆడిట్ నివేదిక, సెక్షన్–51 కింద విచారణ నివేదిక, సెక్షన్–52, 53 కింద తనిఖీ నివేదిక నిర్ణీత గడువులోపు మహాజనసభ ముందుంచి ఈ నివేదికల్లోని లోపాలను గుర్తించి సరిచేయవచ్చునన్నారు. అలాగే సెక్షన్ 50 కింత సంఘ అధికారి లేదా ఉద్యోగిని సస్పెండ్ చేసి రిజిస్ట్రార్ వారి పూర్వఅనుమతితో తిరిగి విధుల్లో చేర్చుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో డిసిసిబి సిఇఓ శంకర్‌బాబు, డిసిఎల్ఓ వెంకటరమణ, ఆడిట్ ఆఫీసర్ నారాయణమ్మ, నూతనంగా నియమితులైన సింగిల్‌విండో ఛైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పుత్తూరు గంగజాతర



**పుత్తూరు రూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన గ్రామ దేవత పిడికిలి గంగజాతర ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం సాయంత్రం మంచినీళ్ళగుంట వద్ద నుంచి చాటుబండి ఊరేగింపు నిర్వహించి అనంతరం గంగమ్మ మండపం వద్దకు చేరుకుంది. అనంతరం మండపం వద్ద గంగమ్మను ప్రతిష్టించి పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అలాగే మండపం వద్ద భక్తులు కుంభాలు వేసి అమ్మవారికి అదే విధంగా సమర్పించారు. పట్టణంలోని పలు చోట్ల విద్యుత్‌దీపాలంకరణ వేపాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పాటకచ్చేరి కార్యక్రమంకూడా నిర్వహించారు. రాత్రి అమ్మవారిని పురవీధులో ఊరేగించి నిమజ్జనం కార్యక్రమం చేపట్టారు. అలాగే పుత్తూరు పట్టణంలో జరుగుతున్న గంగమ్మజాతరలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## మున్సిపల్ మేనేజర్ సేవలు మరువలేనివి : కమీషనర్

కుప్పం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన సత్యనారాయణ సేవలు మరువలేనివని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.బుధవారం సత్యనారాయణ దంపతులను మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, సోము,సురేష్, మాజీ ఎంపిటిసిలు ఉమాపతి, సుబ్బు, నరేష్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**రామకుప్పం, సెప్టె ంబర్ 3 ప్రభాతవార్త** అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు. బుధవారం ఎంపిపి సులోచన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో సమస్యల పరిష్కారంకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. యూరియా కొరత లేదని రూ 270లకే బస్తాలను డీలర్లు రైతులకు విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఒ తెలిపారు. నెలరోజులుగా కిలాక్‌పోడు గ్రామంలో మంచినీటి సమస్య ఉందని పరిష్కరించాలని సభ్యులు కోరారు. మండలంలో మూడు చోట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, ఎంపిడిఒ లక్ష్మీకాంత్, డిటి బాలాజీ, వైస్ ఎంపిపి వెంకటరామగౌడు, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, కడ సభ్యుడు రఘు, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

## ఎంపిటిసి సభ్యురాలికి ఘన సన్మానం

రామకుప్పం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



మణీంద్రం సెగ్మెంట్ నూతన ఎంపిటిసిగా ఎన్నికైన అరుణ జ్ఞానశేఖర్‌రెడ్డిని ప్రజాప్రతినిధులు, దేశం నేతలు ఘనంగా సత్కరించారు. అధికారులు బుధవారం ఆమెతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఎంపిటిసిగా ఎంపిక చేసిన ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, వెంకటరమణ, మంజునాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పట్ర నారాయణ, వెంకటరామగౌడు, విశ్వనాథ్, ఆంజనేయరెడ్డి,సీతాపతి, చిన్నికృష్ణ, రవిరెడ్డి, రామలింగారెడ్డి, విజయ్‌రెడ్డి, అలివేలుమంగమ్మ పాల్గొన్నారు.

## గ్లోబల్ లెర్నింగ్‌కు అపోలో-లిసెస్టర్ వర్సిటీలు వేదికలు

– అపోలో విద్యార్థులతో యుకె ప్రొఫెసర్ల ముఖాముఖి



**చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** గ్లోబల్ లెర్నింగ్‌కు అపోలో–లిసెస్టర్ యూనివర్సిటీలు వేదికగా నిలుస్తున్నాయని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ ప్రొ–వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హెన్రియోట్టా ఓ కానర్, స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ కీ మెథమెటికల్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ లీనా సోధా, అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్.క్రోల్‌లు పేర్కొన్నారు. యుకెలోని లీసెస్టర్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు బుధవారం అపోలో యూనివర్సిటీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో వర్చువల్‌గా ఇంటరాక్షన్ అయ్యారు. 2 ప్లస్ 1 బి.ఇంగ్ కంప్యూటర్ సైన్స్ పాత్‌వే ప్రోగ్రాంలో భాగంగా జరిగిన ఈ ఇంటరాక్షన్‌లో తొలి బ్యాచ్ విద్యార్థులకు భవిష్యత్తు చదువుల ప్రణాళిక, పరిశోధనావకాశాలు, గ్లోబల్ కెరీర్ అవకాశాలను యుకె ప్రొఫెసర్లు విద్యార్థులకు వివరించారు. ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను అనుభవిస్తూ రెండు దేశాల్లో చదువుకునే ఈ ప్రత్యేక కోర్సు విద్యార్థులకు గ్లోబల్ లెర్నింగ్‌కు కొత్త మార్గం చూపుతుందని వారు పేర్కొన్నారు. యుకెలో రెండవ అతిపెద్ద యూనివర్సిటీ అయిన లిసెస్టర్‌లో ప్రస్తుతం 20 వేల మందికిపైగా విద్యార్థులు, నాలుగు వేల మంది అధ్యాపకులు వున్నారన్నారు.

## నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

– చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రంగనాథ్



*చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:* ఒక్కరి నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించ వచ్చునని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రంగనాథ్ అన్నారు. జాతీయ నేత్రదానం పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జాతీయ అంధత్వ నివారణ, దృష్టి నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని సూపరిటెండెంట్ డాక్టర్ రంగనాథ్ జెండా వూపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం 8వ తేదీ వరకు జరుగుతుందన్నారు. నేత్రనాదం చేయండి, ఇద్దరు అంధులకు చూపునివ్వండి అనే నినాదంతో ఈ కార్యక్రమంను ముందుకు తీసుకెళ్ళడం జరుగుతుందన్నారు. మీ మృతి అనంతరం మీ కళ్ళు నశించపోకూడదని, నీ కళ్ళను అంధులకు చూపు నిమిత్తం ముందస్తుగా మరణానంతరం దానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ అర్పిత, ఆర్ఎంఓ డాక్టర్ సంధ్య, అపోలో డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, వైద్య విద్యార్థినిలు, నర్సింగ్ విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇగా ప్రసన్నకుమార్ బాధ్యతలు స్వీకరణ

*చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:* ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇగా పివి ప్రసన్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లాకు చెందిన పివి ప్రసన్నకుమార్ 1992లో పిటిఎం మండల ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇగా విధుల్లో చేరారు. 2005 సంవత్సరంలో డిఇగా పదోన్నతి పొందిన ప్రసన్నకుమార్ కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్ళారు. 2006 నుండి 2022 వరకు క్వాలిటీ కంట్రోల్ విభాగం డిఇగా విధులు నిర్వర్తించిన పివి ప్రసన్నకుమార్ ఆపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొంది అన్నమయ్య జిల్లా రాజంపేటకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్ఇగా విధులు నిర్వహిస్తున్న ప్రసన్నకుమార్‌ను ప్రభుత్వం రెగ్యులర్ పదోన్నతి కల్పించి చిత్తూరు జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.



## చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో మమోగ్రామ్ సేవలు ప్రారంభించిన ఎమ్మెల్యే




*చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:* చిత్తూరు ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో మహిళల కోసం మమోగ్రామ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు బుధవారం మమోగ్రామ్ సేవల కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించడం, చికిత్స అందించే సేవలను చిత్తూరు ఆసుపత్రిలో అందుబాటులోకి రావడం సంతోషమైన విషయమన్నారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పక్కాగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రంగనాథ్, అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రొఫెసర్ వినోద్‌భట్, సిఇఓ నరేష్‌కుమార్‌రెడ్డి, డీన్ డాక్టర్ అల్ఫ్రెడ్ అగస్టిన్, జిఎం డాక్టర్ వినోద్, సీనియర్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ రామ్‌గోపాల్‌రెడ్డి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య కోరల నుండి తిమ్మప్పనాయన చెరువు రక్షణకు చర్యలు

గుడిపాల, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

మండల పరిధిలోని రామభద్రాపురం గ్రామ పంచాయతీలోని తిమ్మప్ప నాయని చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకొంది. ఈ చెరువును కాలుష్య కోరల నుండి రక్షించాలని చెరువు ఆయుకట్టు రైతులతో పాటు గ్రామస్తులు అధికారులను వేడుకొంటున్నప్పటికీ వారి నుండి స్పందన కరవు అవుతోంది. తిమ్మప్పనాయని చెరువుకు సమీపంలోనే చిత్తూరు రూరల్ మండల పరిధిలోని ప్రాంతంలో ఓ జ్యూస్ ఫ్యాక్టరీ వుంది. ఈ ఫ్యాక్టరీ నుండి విడుదల అయ్యే వ్యర్థ పదర్థాలు నేరుగా తిమ్మప్పనాయని చెరువులోకి వెళ్తున్నాయి. ఫలితంగా చెరువు నీరు దుర్గంథభరితం అవుతోంది. ఈ నీటిని దప్పిక తీర్చుకోవడానికి చెరువు పరిసరాల్లో మేత మేసే పశువులు సైతం తాగలేని పరిస్థితి ఏర్పడింది. ఫ్యాక్టరీ నుండి విడుదల అయ్యే వ్యర్థాలు చెరువు నీటిలో కలవకుండా ఫ్యాక్టరీ యాజమానులు పక్కాగా చర్యలు తీసుకోవాలని, అలాగే అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ హరిణి హేమాద్రినాయుడు డిమాండ్ చేశారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు అభినందనలు

చిత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:

చిత్తూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన బిజెపి సీనియర్ నాయకులు మోహన్‌నాయుడుకు భాజపా నేతలు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, సీనియర్ నాయకులు పూర్ణచంద్ర, జిల్లా కార్యవర్గసభ్యులు సత్య నారాయణ,పూతలపట్టుమండల అధ్యక్షులు ప్రసాద్, సెంట్రల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు వున్నారు.

## సామూహిక త్రయంబక రుద్ర పారాయణం

**చిత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం, ఇరువారంలో వెలసిన శ్రీకామాక్షి సమేత నాగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు బుధవారం ఉదయం 7.30గంటల నుంచి 9.10గంల వరకు సామూహిక త్రయంబక రుద్ర పారాయణం, భజన నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి నిర్వహించి ప్రసాద వితరణ గావించారు. శ్రీ కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు ఎస్ మధుసూదనం, బాలవికాస్ గురువులు అనురాధ, వసంత, లావణ్య, సావిత్రి, వాసవి, కమల ప్రభ, అమరనాథరెడ్డి, శేషనారాయణ, గజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## శక్తిక్షేత్రంలో స్త్రీశక్తి విజయోత్సవం మహిళలకు బ్రహ్మోత్సవం : చల్లా బాబు

–మంచి చేసిన చంద్రన్నకోసం గంగమ్మ పూజలు





*బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 3 ప్రభాతవార్త* శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ పాదాల చెంత స్త్రీశక్తి విజయోత్సవ సభ మహిళా మణులకది బ్రహ్మోత్సవం వంటిదని పుంగనూరు నియోజకవర్గ తేదేపా ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి(బాబు)అన్నారు. మండలంలోని బోయకొండ గంగాపురంలో నియోజకవర్గ స్థాయి స్త్రీశక్తి విజయోత్సవ ర్యాలీ, సభలను నిర్వహించారు. అనునిత్యం మహిళ అభ్యున్నతిని ఆశించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మరింత శక్తిసామర్థ్యాలు ప్రసాదించాలని మహిళలందరూ గంగమ్మకు పూజలు చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. గత ఐదేళ్ళ పాలన రాష్ట్రంలో రాక్షసత్వంతో కూడుకున్న దన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, భావితరాల మంచి కోసం అందరం కలసికట్టుగా నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా ఎన్నుకొన్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మహిళా మణులందరికీ న్యాయం జరిగేలా అన్ని పథకాలు అందించిన ఘనత చంద్రన్నకు దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సస్ అయిన విషయాన్ని వివరించారు. సూపర్ సిక్స్‌పై చర్చించేందుకు వైకాపా నాయకులు బోయకొండకు రావాలనీ, మహిళా మణులే తగిన సమాధానం చెబుతారన్నారు. అనంతరం పుంగనూరు నియోజకవర్గంలోని 280స్వయం సహాయక సంఘాలకు రూ. 42.50కోట్లు బ్యాంకు రుణాల మెగా చెక్కును మహిళలకందించారు. శక్తి స్వరూపిణీ గంగమ్మను మహిళలు దర్శించు కొన్నారు. మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు మాదిరాజు లక్ష్మణరాజు, ఎం .ప్రదీ ప్‌రాజు,రామకృష్ణమరాజు,తహశీల్దార్ పార్వతి,ఎంపిడిఓ లీలామాధవి,వెలుగుఏపిఎంసుబ్ర మణ్యం, నియోజకవర్గంలోని 6మండలాల నుంచి వేలాదిగా స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## అమాసను కలసిన పగడాల

చౌడేపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



జిల్లా డిసిసిబ్యాంకు ఛేర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డిని మండల సింగిల్ విండో ఛేర్మన్ పగడాల హరిరాయల్ కలిశారు. చిత్తూరులో జరుగుతున్న జిల్లా స్థాయి నూతనం ఛేర్మన్ల సమావేశంలో ఆయనను కలసి మండల సింగిల్‌విండో సమాచారాన్ని తెలియజేసారు. ఈమేరకు అవగాహన కార్యక్రమంలో హరిరాయల్ పాల్గొన్నారు.

## నరకాన్ని చూపిస్తున్న పూతలపట్టు - పెనుమూరు రోడ్డు

పూతలపట్టు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త



పూతలపట్టు నుండి పెనుమూరుకి వెళ్లి ఆర్ అండ్ బి రహదారి గుంతలతో అస్తవ్యవస్థంగా మారింది. దీంతో ఇటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు నడకదారిలో వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు వర్షానికి నీళ్ల గుంతల్లో చేరడంతో వాటి లోతు తెలియక అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మరోపక్క అధికారంలోకి వచ్చాం రోడ్లు బాగు చేస్తున్నామని చెప్పుకుంటున్నారు. పూతలపట్టు పెనుమూరు రోడ్డు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పూతలపట్టు నుండి పెనుమూరు వరకు ప్రయాణం చేయాలంటే రాత్రి వేళలో భయం వేస్తుందని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బి అధికారులు కనీసం గుంతలైన పూర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. రోజు పూతలపట్టు నుండి పెనుమూరుకి వందలాది మంది ప్రయాణం చేస్తున్నారు. ఈ రహదారి పై అన్ని శాఖలు అధికారులు ప్రజాప్రతినిధులు వెళుతున్న ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు ఈ రోడ్డును అధికారులు దృష్టికి తీసుకెళ్ళి బాగు చేయాలన్నారు. ఈ రహదారికి నియోజవర్గ మండల నాయకులు తాత్కాలిక మరమ్మతులైన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## మాజీ ప్రధానిని కలిసిన రాష్ట్ర యువ జనతాదళ్ అధ్యక్షులు

చిత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:



భారత మాజీ ప్రధానమంత్రి, జనతాదళ్ (ఎస్) జాతీయ అధ్యక్షులు హెచ్‌డి దేవేగౌడను ఏపిరాష్ట్ర యువ జనతాదళ్ అధ్యక్షులు మొహిద్దీన్ అలీ మర్యాదపూర్వంగా కలిసారు. కర్నాటక రాష్ట్రం బెంగళూరులోని దేవేగౌడన్‌ను ఆయన నివాసంలో కలసి ఆంధ్రప్రదేశ్ పార్టీ పరిస్థితిపై వివరించారు. సోషలిస్ట్ భావజలం వున్న యువకులను, మహిళలను, పార్టీలో ప్రోత్సాహించాలని వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించేలా చూస్తానని దేవేగౌడ హామి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

## విజయం విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ

చిత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:



చిత్తూరు పట్టణంలోని విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించారని విద్యాసంస్థల అధినేత డా.ఎం.తేజోమూర్తి తెలిపారు. తిరుపతిలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి బాస్కెట్ పోటీలో తమ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న గురుచరణ్ టీం విశేష ప్రతిభ కనబరచి గెలుపొంది, రాష్ట్రస్థాయిలో విశాఖపట్టణం జిల్లాతో ఆడి విజేతగా నిలిచారని పేర్కొన్నారు. కాగా విద్యార్థులు సంస్థ చైర్మెన్‌తో పాటు అధ్యాపకబృందం గురుచరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## పలమనేరు రూరల్ సిఐగా పరశురాముడు



పలమనేరు,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

పలమనేరు రూరల్ సిఐగా పరశురాముడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. బైరెడ్డిపల్లె ఎస్ఐగా పని చేస్తున్న పరశురాముడు పదొన్నతిపై పలమనేరు రూరల్ (బైరెడ్డిపల్లె,పెద్దపంజాణి) సిఐగా బాధ్యతలను స్వీకరించారు.ఈ మేరకు ఆయన బైరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలను చేపట్టారు

## గంజాయి విక్రేతల అరెస్టు

–4కేజీల గంజాయి స్వాధీనం

పలమనేరు టౌన్,సెప్టెంబర్ 03,ప్రభాతవార్త:



అక్రమంగా గంజాయి విక్రయానికి తరలిస్తున్న నలుగురిని పలమనేరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.ఈ మేరకు పలమనేరు పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ ప్రభాకర్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరు పట్టణానికి చెందిన షేక్ సుల్తాన్ బాషా(29), ఎస్. ఖజా (29),రామసముద్రం మండలానికి చెందిన సయద్ జుల్‌హర్న్(28),షేక్ మహ్మద్ ఇస్మాయల్(27)లు అక్రమంగా గంజాయి తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు పట్టణం సమీపంలోని గంటావూరు జాతీయ రహదారి వద్ద అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద రూ.80వేల విలువ చేసే 4కేజీల గంజాయిని గుర్తించామని తెలిపారు.ఈ మేరకు వారిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న గంజాయి మరియు 4 సెల్‌ఫోన్లును స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించామని ఆయన తెలిపారుఈ కార్యక్రమంలో సిఐలు మురళీమోహన్,పరశురాముడు,ఎస్ఐ లోకేష్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో నేడు (గురువారం)

**మధ్యాహ్నం : అభిషేకం, బిక్షాండి., ఉభయదారులు: దేవస్థానం వారిచే.రాత్రి : తిరుకళ్యాణం ఉభయదారులు : కాణిపాకం, తిరువణంపల్లె, వణిగ వంశస్థులు రాత్రి : అశ్వవాహనసేవ**

ఉభయదారులు: 44 బొమ్మసముద్రం, తిరువణంపల్లె, చింతమాకులపల్లె, కారకాంపల్లె, గ్రామాదుల గోనుగుంట బలిజ వంశస్థులు.ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు : రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తిరంజని, మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు సుమతి భాగవతారిణిచే హరికథ, రాత్రి 8 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు పౌరాణిక నాటకప్రదర్శనలు

## విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి - జెఎన్‌టియు డైరెక్టర్



**కుప్పం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త** విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అనంతపురం జెఎన్‌టియు అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డా॥ సురేష్ బాబు పేర్కొన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ (అటానమస్)లో బుధవారం జాతీయ స్థాయి సింపోజియం అంతరిక్ష 2K25ను ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కొత్త నైపుణ్యాలను అభ్యసించడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చున్నారు. తద్వారా సుస్థిరమైన వృత్తిని నిర్మించుకోవచ్చున్నారు. వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యా కార్యక్రమాలతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని జ్ఞాన సముపార్జనకు కృషి చేయాలని సూచించారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. సందర్భంగా వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన 140మందికి పైగా విద్యార్థులు పేపర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్స్, టెక్నికల్ క్విజ్ వంటి పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, హెచ్ఓడి డా॥ లోకేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులు రామకృష్ణ,సుబ్రమణ్యం శర్మ

శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త




రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను 2025 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రకటించారు.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలానికి ఒరెండు అవార్డులు అభించాయి. వీరిలో ముచ్చివోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు డాక్టర్ సుబ్రమణ్యం శర్మను ఎంపిక చేసారు. ఆయన పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్‌గా వ్యవహారించారు. విద్యార్థులకు ఇష్టమైన భౌతిక శాస్త్ర అంశాలను ప్రయోగశాలల్లో బోధించటం వెన్నతో పెట్టిన విద్యగా అభివృద్ధి చెందారు. ఎస్‌వి సైన్స్ క్లబ్,ఎపిపిఎస్‌టిఎఫ్ నిర్వహించిన అనేక శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని అభిరుచిని కల్గించేలా బోధించినందుకు అలాగే సైన్స్ ఫేర్ ఇన్సె ఫైర్ ఎగ్జిబీషన్స్‌లో జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో పాల్గొని రాణించేలా విద్యార్థులను తీర్చి దిద్దారు.ఎన్ఎంఎస్‌లాంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి స్కాలర్‌షిప్ వచ్చే విధంగా తీర్చి దిద్దారు.ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుగా ప్రకటించారు.

**ఎగువ వీధి ఉపాధ్యాయునికి . . .**

శ్రీకాళహస్తి మండలంలోని ఎగువవీధికి చెందిన పిఇటి రామకృష్ణకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు వరించింది.రామకృష్ణ విద్యార్థులకు ఆట పోటీల్లో రాణించుటకు తీర్చి దిద్దారు. వ్యాయామ ఉపాధ్యాయుడుగా రామకృష్ణ విద్యార్థులను తీర్చి దిద్దారు. ఆయన క్రమశిక్షణ,జవాబుదారి తనం విద్యార్థుల ఆరోగ్యం పట్ల గుర్తింపుకు నిదర్శనంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉధ్యాయుడుగా అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును ఈ నెల 5న రాష్ట్ర రాజధానిలో అందుకోనున్నారు.

## యాగశాలలో కలశ స్థాపన

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి యాగశాలలో కలశ స్థాపన గావించారు. ఆలయంలోతెలిసి తెలియక పొరబాటున జరిగే తప్పదాలకు నివృత్తికి ఈ పవిత్రోత్సవాలను నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో ఐదు రోజుల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి యాగశాలలో కలశస్థాన గావించి హోమాలను వెలిగించారు.ఈ కార్యక్రమాలను ఆలయ అభిషేక ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్,పౌరోహితులు అర్ధగిరి ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటటెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్సె పెక్టర్ వెంకటస్వామి పాల్గొన్నారు.

## శివయ్య సేవలో హర్యానా మాజీ సిఎం

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హర్యానా మాజీ సిఎం భూపేంద్ర సింగ్ హుడా కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఓ మోహన్ స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయం దర్శనం చేసుకున్నారు. తరువాత వారికిఆలయ మర్యాదలతో వవేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు. ఆయనతో పాటు మాజీ నాయకులు మాజీ మంత్రి సుద్విర్‌ఖటారియా,ఎంపిలు భీపేంద్రసింగ్ హుడా, వరుణ్‌చౌదరి,జయప్రకాష్,సత్వాల బ్రహ్మచారి ఎంఎల్ఏలుభరత్‌భూషణ్, సుభాష్ చంద్ర ఖాస్త్రా,మాజీ మంత్రి సుధీర్‌ఖటారియాలు ఉన్నారు.వారికి ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.ఈ కార్యక్రమాల్లో టెంపుల్ సూపరింటెండెంట్ నాగభూషణంయాదవ్, తెలుగుదేశం నాయకులు లక్కమనేని మధు,రవీంద్రబాబు పర్యవేక్షించారు.

## కయ్యూరికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు

తొట్టంబేడు,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



ఆయన విద్యాబోధన తీరే వేరు. ఆయనకు లెక్కలేనన్ని అవార్డులు, ప్రశంసలు, సన్మానాలు. ఆయనే తొట్టంబేడు మండలంలోని దిగువ సాంబయ్యపాళెం సెంకడరీ గ్రేడ్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు.ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందించే ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును ప్రకటించింది. పని చేసేది ఓ కుగ్రామంలోని పాఠశాల ఉపాధ్యాయుడు.అయితే ఆయన ఆలోచనలు విద్యార్థులను కార్పొరేట్ స్థాయిలో తీర్చి దిద్దాలని నిరుపేద పిల్లలు సైతం అత్యున్నత స్థాయిలో గుర్తింపు పొందాలన్నది లక్ష్యంగా పని చేస్తున్నారు. ఆయన విన్నూత్న భోధన,సాహిత్య,కళలు, విద్యార్థులను ఆట పాటలతో తీర్చి దిద్దాలని పాఠశాలకు ఆకర్షించాలనే లక్ష్యంతో బోదనే చేస్తున్నారు. ఆయన ఆట పాటలవిద్యతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆయన ఏ పాఠశాలలో పని చేస్తే ఆ పాఠశాల ఓ ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టిస్తారు. పసి పిల్లలను ఆకట్టుకుంటూ వారిని తీర్చి దిద్దటంలో తల్లిదండ్రుల కన్నా బాధ్యతా యుతంగా వ్యవహారిస్తూ బోధన చేయటంతో ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం అందించే 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు' వరించింది. ఆయన్ను మండలంలోని ఉపాధ్యాయులు ప్రముఖులు అభినందించారు.

## సహకార కేంద్ర బ్యాంక్ పిఏసిఎస్ నూతన అధ్యక్షుల సమావేశం

పాకాల, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త



చంద్రగిరి నియోజకవర్గ చైర్మన్‌లు కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డిసిసిబి చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా ఆరు మండలాల అధ్యక్షులు బుధవారం రోజున కలిసారు. ఈ కార్యక్రమములో పాకాల పిఏసిఎస్ చైర్మన్‌సావిత్రి క్రిష్ణమనేని, నరసింగా పురం, చైర్మన్ ఆర్. వినోద్ కుమార్, మల్లంగుంట చైర్మన్ సి. మధు శేఖర్, రామచంద్రాపురం చైర్మన్ సి జనార్ధన్ చౌదరి,ఎరావారిపాల్యం చైర్మన్ ఎస్ రఘు, చిన్నగోటిగల్లు చైర్మన్ ఎం. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం 30 వ వార్డులోని రిజర్వాయర్ కాలనీ, ఆయుర్వేదిక్ హాస్పిటల్, స్విమ్స్ కూడలి ప్రాంతాల్లో అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నిత్యం.చెత్త సేకరణకు వాహనాలు వస్తున్నాయా? తదితర విషయాలను నివాసం ఉంటున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చాలా మంది తమ ఇండ్లలోని చెత్తను బయట పడేసి బాధ్యత లేకుండా ఉంటున్నారని అన్నారు. ప్రతి రోజూ మీ ఇంటి వద్దకు వచ్చే తమ వాహనాలు, సిబ్బందికి చెత్త అందించి నగర శుభ్రతకు సహకరించాలని అన్నారు. అలాగే కాలువల్లో చెత్త వేయడం వలన అవి బ్లాక్ అయ్యి రోడ్లపైకి నీరు వచ్చి ప్రజలకు ఇబ్బంది అవుతోందని అన్నారు. ఆయుర్వేద హాస్పిటల్ వ్యర్థాలు కాలువల్లో వేయొద్దని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు మధు, శిల్ప, ఏసిపి మధు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

## గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు రూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన పిడికిలి గంగమ్మతల్లి జాతర మహోత్సవంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు జాతర నిర్వాహకులు ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## గంగమ్మజాతర మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి రోజా

**పుత్తూరు రూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలో నిర్వహిస్తున్న గంగమ్మజాతర మహోత్సవంలో మాజీ మంత్రి రోజా పాల్గొని అమ్మవారిని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. అమ్మవారి కటాక్షాలు ప్రతి ఒక్కరిపై కలకాలం ఉండాలని ఆమె ఆకాంక్షించారు. వైసీపీ నాయకులు, కుటుంబ సభ్యులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



## కైలాసపురం గ్రామంలో గంగజాతర

పుత్తూరు రూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:




పుత్తూరు మండల పరిధిలోని కైలాసపురం గ్రామంలో గంగమ్మతల్లి, అవనాక్షమ్మ అమ్మవారు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం నగరిఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కైలాసపురంలోని గంగమ్మను దర్శించుకున్నారు. అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలతో విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు. మంగళవారం అర్ధరాత్రిపైన అమ్మవారిని పురవీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. రాత్రి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం కార్యక్రమం చేపట్టారు. భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## యువతకు మెరుగైన ఉపాధి : జేసీ

తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ః



రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్ద పీట వేస్తోందని, నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలని, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు సక్రమంగా అమలు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) జరిగిన సమీక్షలో జేసీ మాట్లాడారు. సింగ్ డెస్క్ విధానంలో మే 2025 నుంచి 2231 పరిశ్రమలకు గాను 2183 అనుమతులు ఇచ్చామని మరో 44 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. వీటికి కూడా ప్రోత్సాహకాలు రూ.4.43 కోట్లు అందించడానికి నేడు ఆమోదం తెలిపినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి విజయ్ భరత్‌రెడ్డి, ఫ్యాక్టరీస్ డెప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, రవాణాశాఖ అధికారి మురళీ మోహన్, ఎల్‌డీఎం రవికుమార్, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటిక స్థల ఎంపికకు చర్యలు : నగరి ఆర్డీవో

విజయపురం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:



మండలంలోని విజయపురం దక్షిణపు ఆది ఆంధ్రవాడ వాసుల విజ్ఞప్తి మేరకు బుధవారం నగరి రెవెన్యూ డివిజనల్ అధికారిణి అనుపమ స్వయంగా గ్రామానికి విచ్చేసిన శ్మశాన వాటికకు ఒకటి, రెండు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆది ఆంధ్రవాడ వాసులకు శ్మశాన వాటికకు అనువైన ప్రాంతాన్ని కేటాయించేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని విజయపురం తహసీల్దార్ కిరణ్‌కు ఆదేశించారు. శ్మశాన వాటిక స్థలంతో పాటు అందుకు అవసరమైన రోడ్డు సౌకర్యం కూడా కల్పించాల్సి ఉందని, అందుకనుగుణంగావారికి రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలాలను పరిశీలించి నివేదిక తయారు చేయాలని సూచించారు. అనంతరం ఆది ఆంధ్రవాడ వాసులు మాకు కొంత మందికి ఇంటి స్థలాలు కూడా లేవని, ఉన్న చోట కనీస వసతులు కల్పించాలని ముఖ్యంగా మురికి నీటి కాలువలు నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సెంటు భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వభూములను పంపిణీ చేయాలని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. మీ సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

## కొత్తగా పెళ్లైన దంపతులను ఆశీర్వదించిన మాజీ మంత్రి రోజా

విజయపురం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:



మండలంలోని పాతార్కాడు గ్రామంలో వైసీపీ నాయకుకు నాగేష్ సోదరుడు భానుప్రకాష్, మోహన్ ప్రియ నూతన వధూవరులను బుధవారం మాజీ మంత్రి రోజా ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైసీపీ నాయకుడు రవి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శివరాజు, ఉపాధ్యక్షుడు సతీష్ యాదవ్, పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి శేఖర్‌రాజు,గోపినాథ్, నాయకులు నారపరాజు, సుబ్బు యాదవ్, అరుణాచలం, దేవా, ప్రతాప్, కృష్ణయ్య, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 7న రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

తిరుపతి హెల్త్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త ః



ఈ నెల 7న శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి బాలసుబ్రమణ్యం తెలియజేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ టోర్నమెంట్ లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి సుమారు 280 మంది క్రీడాకారులు పాల్గొంటారని టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో పాల్గొనే అవకాశం లభించనుంది. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రధానం చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ద్వారా రాష్ట్రంలోని ఉత్తమ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఒకే వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించనుండగా ర్యాంకు పాయింట్ల కోసం జరిగే ఈ పోటీ క్రీడా స్ఫూర్తి నైపుణ్యం, వ్యూహాల ప్రదర్శనకు వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గోపి, భరత్, రవిచంద్రన్, సురేష్‌బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## భరద్వాజస్వామి గ్రామోత్సవం:

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ధార్మిక కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఐదు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాలను బుధవారం సంకల్ప పూజలతో శ్రీకారం చుట్టారు. ఆలయంలో గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద శాస్త్రోక్తంగా హోమాలు ఏర్పాటు చేసారు. ఇక్కడ కలశ స్థాపన గావించారు. ఆలయ అర్చకులు డాక్టర్ స్వామినాధన్ పూజలు జరుపుతుండగా ఆలయ పౌరోహితులు అర్ధగిరిస్వామి వేదమంత్రాలను పఠించారు.సంకల్ప పూర్వక అభిషేకాలు జరిపారు. నైవేద్య దీపారాధనలు మంత్రపుష్పం నిర్వహించారు. ఈ సందర్భంగా సాలెపురుగు,పాము, ఏనుగులతో పాటు భరద్వాజ మహర్షిల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ఇన్సె పెక్టర్ సుదర్శనం నాయుడు సారథ్యంలో గ్రామోత్సవం జరిపారు. నాలుగుమాడావీధుల్లో ఇంటింటి వద్ద హారతులిచ్చారు.

## గణపతి హోమంలో ఎంఎల్ఏ దంపతులు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని కుమారస్వామి కొండ కింద వినాయక మండపంలో నెలకొన్న వినాయక ఆలయంలో బుధవారం తెలుగుదేశం ద్వితీయ శ్రేణి నాయకులు హోమాలు,పూజలు జరిపారు. వేకువ జామునుంచి ఆలయం వద్ద ప్రత్యేక హోమ గుండాలు ఏర్పాటు చేసారు. చక్కగా పందిళ్ళు వేసి వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. సుమారు మూడుగంటల పాటు లోక కళ్యాణ నిమిత్తం ఇక్కడ పూజలు హోమాలు జరిపారు. తెలుగుదేశం నాయకులు హరి, వంకాయల సిద్దులయ్యలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సుమారు 400 చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసారని ఇది ధార్మికతకు నిదర్శనం అన్నారు. నెల నెలా ఒక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. సుధీర్‌రెడ్డి కుటుంబసభ్యులతో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో ఎంఎల్ఏ భక్తులకు స్వయంగా వడ్డించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు,తదితరులు ఎపాల్గొన్నారు.

## ఏర్పేడులో పంచాయతీజిల్లా అధికారి:

శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



జిల్లా పంచాయతీ అధికారి సుశీలా దేవి బుధవారం ఏర్పేడు మండల ఽకేంద్రంలోని పంచాయతీని ఆకస్మికంగా తనీఖీ చేసారు. ఆమె పంచాయతీలోని స్వర్ణ పంచాయతీ ద్వారా ఆన్‌లైన్‌లో ఇంటిపన్నుల చెల్లింపు విధానాలను ప్రజలకు వివరించారు. గ్రామస్తులచే ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించే విధానంపై చైతన్య పరచారు. అలాగే పంచాయతీలో జరిగిన స్వామిత్ర సర్వేలు కూడా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అన్‌లైన్‌ద్వారా పంచాయతీలో జరిగే అక్రమాలకు అడ్డుకట్టవేయటం జరుగుతుందన్నారు.ఈ పరిశీలనలో సర్పంచ్ శివయ్య,డెప్యూటీ ఎంపిడిఓ రమణకుమార్,కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మరో ఆరు బార్లకు మలి విడతకైనా ముందుకు వస్తారా!?

ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి జిల్లాలో 32మద్యం బార్లకోసం తొలివిడత నోటిఫికేషన్‌లో ఉత్సాహం చూపని వ్యాపారులు మిగిలి ఉన్న మరో ఆరుబార్ల ఏర్పాటుకు ముందుకువస్తారా?అనే అనుమానాలు ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులను గుబులురేకెత్తిస్తోంది. తొలివిడతగా నోటిఫికేషన్ విడుదల చేసినా ఆ గడువులోపు దరఖాస్తులు వేయలేదు. ఆ తరువాత మరో వారంరోజులు గడువు పొడిగించిన ప్రభుత్వం తిరుపతి జిల్లాలో 32 బార్లకుగాను 26బార్లకే వ్యాపారులు బలవంతంగా దరఖాస్తుచేసుకుని సెప్టెంబర్ 1వతేదీ నుండి వ్యాపారాలు మొదలుపెట్టారు. ఈ నూతన నోటిఫికేషన్‌లో బార్ల వేళల సమయం పెరిగినా వ్యాపారం అంతంతమాత్రంగానే జరుగుతుందని ఊహించిన వ్యాపారులు బార్లకోసం పోటీపడలేదు. ఫైగా ప్రైవేట్ మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్‌రూమ్‌లకు అనుమతివ్వడంతో బార్లకు పెద్దగా డిమాండ్ ఉండదని, మందుబాబులు రారని వ్యాపారులు అంతర్మథనం చెందుతున్నారు. ఈ నేపధ్యంలో తొలివిడత 26బార్లకుగాను ప్రభుత్వ ఖజానాకు 12,95,58,416 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చిందని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అదికారి కె.నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. అయితే మిగిలిన 6బార్లకు మలివిడత నోటిఫికేషన్‌లో వ్యాపారులు ఎంతవరకు ఆసక్తిచూపుతారనేది ఉత్కంఠరేపుతోంది. 2025-28 నూతన బార్‌పాలసీవిధానం క్రింద మలివిడత దరఖాస్తులకు ఈనెల 14వతేదీ సాయంత్రం 6గంటల వరకు గడువు విధించారు. 15వతేదీ ఉదయం జిల్లాకలెక్టరరేట్‌లో లాటరీ నిర్వహించి బార్లకు లైసెన్స్‌లను ఖరారుచేస్తారు. అయితే తొలివిడతలోనే మద్యం బార్లకు వ్యాపారులనుండి ఆశించిన స్పందన లేకపోయింది.

# తిరుపతి డివిజన్

## శ్రీకాళహస్తిలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు భవనాల పరిశీలన

తెలుగుగంగ అతిథి గృహం కేటాయింపుకు ప్రతిపాదన

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త



తిరుపతి జిల్లాలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు విద్యాశాఖ కసరత్తు చేస్తుంది. ఈ నేపధ్యంలో ఈ పాఠశాలను శ్రీకాళహస్తిలో ఏర్పాటుకు శాసనసభ్యుడు వెంకటసుధీర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు.ఈ నేపధ్యంలో బుధవారం చక్కటి భవనాలను ఏర్పాటుకు తెలుగుగంగ అతిధి గృహాన్ని పరిశీలించారు. తెలుగుగంగ కార్యాలయాలు తిరుపతికి మళ్ళించిన తరువాత ఇక్కడ ఎస్ఇ కార్యాలయం, అతిథి గృహం ఖాళీగా ఉన్నాయి. ఇవి శిధిలావస్తకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే తెలుగుగంగ కాలనీలో విద్యాలయాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ఈ నేపధ్యంలో 'నవోదయ పాఠశాల' ఏర్పాటుకు సంబంధించి భవనాలను ఎంఎల్ఏ ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డితో కలసి పరిశీలించారు. ఇక్కడ గిరిజన గురుకులం ఉంది.అలాగే ప్రభుత్వ డిగ్రీకళాశాల, హాస్టల్స్ ఉన్నాయి.ఇక్కడ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.ఈ నేపధ్యంలో బుధవారం ఎంఎల్ఏ తెలుగుగంగ అతిధి గృహాలు పరిసరాలను పరిశీలించారు. ఆయనతో పాటు విజయకుమార్‌నాయుడు, చెంచయ్యానాయుడు,పేరం నాగరాజునాయుడు,కృష్ణయాదవ్‌లతో కలసి భవనాలను పరిశీలించారు.

**క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం ప్రముఖులుతో బుధవారం పంచాయతీరాజ్ అతిధిగృహంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకత ఉండాలని గ్రామాల్లోని సమస్యలను గుర్తించి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. వర్షాకాలం వస్తుంది. కాబట్టి ప్రజలకు ఆరోగ్యం కోసం ముందు జాగ్రత్తగా మంచినీటిని క్లోరినేషన్ చేయాలని సూచించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని వివరించారు.

## అధైర్యపడకండి...అండగా ఉంటాం

-హరిజనవాడలో పర్యటించిన ఎస్సీ సెల్ నాయకులు

తిరుపతిరూరల్,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



దుర్గసముద్రం హరిజనవాడపై అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ బలిజలు దాడిచేసి దళితులను గాయపరచడంపై ఎస్సీ నాయకులు రాజేంద్ర, మల్లారపు వాసు, సెల్వంలు మండిపడ్డారు. బుధవారం దుర్గసముద్రం హరిజనవాడలో పర్యటించి గాయపడిన ఉప సర్పంచ్ చిరంజీవితో పాటు గాయపడిన యువకులను పరామర్శించి, ధ్వంసమైన ఇండ్లను పరిశీలించారు. ఆదివారం రాత్రి దుర్గసముద్రం గ్రామ పంచాయతీలో వినాయక విగ్రహాల నిమజ్జనంలో దళిత యువకులకు, బలిజ యువకులకు మధ్య ఘర్షణ జరిగిన విషయం తెల్సిందే. హరిజనవాడపై జరిగిన ఘటనను రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్ళి హరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని హామీ ఇచ్చారు. దుర్గసముద్రం హరిజవాడలో గాయపడినవారికి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. అవసరమైతే తిరుపతిరూరల్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ నాయకులు శివ, స్థానికుడు జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ టైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో

బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్న రాగిపాలెం విహాస్

తిరుపతి క్రీడ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :



ఒడిస్సా రాష్ట్రం కటక్ జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 28 నుండి సెప్టెంబర్ రెండో తేదీ జరిగిన టైక్వాండో కైరోగి పుంసే నాలుగవ సబ్ జూనియర్, సీనియర్ నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలలో తిరుపతికి చెందిన రాగి పాలెం విహాస్ బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. విహాస్ టైక్వాండో కైరోగి పుంసే సబ్ జూనియర్ అండర్ 38 కిలోల బాలుర విభాగంలో ప్రత్యర్థిని చిత్తుచిత్తుగా ఓడించి విహాస్ అత్యధిక పాయింట్లతో బ్రాంజ్ మెడల్ గెలుపొందారు. రాయలసీమ ఉమ్మడి జిల్లాల నుంచి మొట్టమొదటిసారిగా జాతీయస్థాయి టైక్వాండో పుంసే సబ్ జూనియర్ పోటీలకు విహాస్ హాజరై తొలి కాంస్య పతకాన్ని సాధించారు. ఆ విద్యార్థి కాంస్య పతకం సాధించడం పట్ల రాయలసీమ జిల్లాలలోని టైక్వాండో క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారు. ఈ విజయానికి తోడ్పడిన కోచ్ లు, మేనేజర్లు, గోవర్ధన్ పవన్ కుమార్, సాయిరాం, రోహిత్‌కు రుణపడి ఉంటానని విహాస్ తెలిపారు. బ్రాంజ్ మెడల్ సాధించిన విహాస్‌ను ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు.

## భూసార పరీక్షలతో ఎరువుల వినియోగం మంచిది..!

డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారావు

చంద్రగిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



రైతులు తమ వ్యవసాయ పొలాలలో ముందుగా మట్టి పరీక్షలు నిర్వహించడం ద్వారా ఎరువులను వినియోగించడం మంచిదని చిత్తూరు డాట్ సెంటర్ కోఆర్డినేటర్, సైంటిస్ట్ డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని పనపాకం, దోర్నకంబాల పంచాయతీలలో బుధవారం పొలం పిలుస్తోంది, గ్యాప్ పొలంబడి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి పంటలో కాండం తొలిచే పురుగు, ఆకుముడత, అగ్గితెగులు బ్యాక్టీరియా, ఎండు తెగుళ్ళు నివారణపై రైతులకు వివరించారు. అదేవిధంగా వేరుశెనగను ఆశించే పురుగులు, తెగుళ్ళ నివారణ కోస ం సమగ్ర పద్ధతుల గురించి వివరించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్యాయంగా జీవన ఎరువులు, పచ్చిరొట్టె పంటలు, పురుగు మందులకు బదులుగా జీవసంబంధమైన మందులను పిచికారి చేసుకోవాలన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, ఈ పంట నమోదు, బుకింగ్‌తో పాటు వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పథకాలను రైతులకు వివరించారు. వివరించారు.

## బహిరంగ వేలం పాటకు విశేష స్పందన

శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ ఈఓ మమత

చంద్రగిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటకు విశేష స్పందన లభించినట్లు ఆలయ ఈఓ మమత తెలిపారు. ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించే తలనీలాలు, వస్త్రాలు, కొబ్బరి చిప్పలను సేకరించుకొనుటకు, పూజా సామగ్రి విక్రయించుకునేందుకు బుధవారం వేలం నిర్వహించారు. ఇందులో భాగంగా పూజా సామగ్రి విక్రయించుకునేందుకు ఏడాది కాలానికి 2025 అక్టోబర్ 19 నుండి 18 అక్టోబర్ 2026 వరకు రూ.2,95,000/-లకు, అదేవిధంగా 2025 అక్టోబర్ 1 నుండి 30 సెప్టెంబర్ 2026 వరకు వస్త్రాలు సేకరించుకునేందుకు రూ.1,11,000/-లకు, అదేవిధంగా కొబ్బరి చిప్పలు సేకరణకు రూ.1,20,000/-లకు హెచ్చు మొత్తంతో ఔత్సాహికులు వేలంలో దక్కించుకున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు. కాగా తలనీలాలు సేకరణకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పాకాల గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఆలయ ఈఓ ఎస్.యువరాణి పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సజ్జ కంకులను కాల్చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

విజయపురం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:

సజ్జ కంకులను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చేసిన సంఘటన మండలంలోని ఆమగుంటలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఆమగుంటలో రైతు రామూర్తి సుమారు మూడు ఎకరాల సజ్జ సాగు చేసి నూర్పిడి కోసం గ్రామానికి దగ్గరలో రోడ్డు పక్కన ఆర బెట్టి నూర్పిడి చేయడానికి యంత్రం కోసం చూస్తున్నారు. రైతు రామూర్తిపై ఓర్వని కొందరు దుండగులు పథకం వేసి రాత్రి బాగా ఎండిన సజ్జ కంకులను కాల్చివేయడంతో సుమారు రూ.35 వేలు నష్టం వాటిల్లిందని విలపించారు. రాజకీయంగా దెబ్బ తీయాలని చేశారా...కక్ష్యతో చేశారా....తెలియడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ మహేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can | పుత్తూరు శాఖ, పుత్తూరు, తిరుపతి జిల్లా, ఫోన్: 8330938031

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను ఏట్టాదా కాకుండా తిరిగి వచ్చినది. 10.09.2025వ తేది లోపు బకాయిలు, ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు.లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది: 11.09.2025 సా.4.00గంIIలకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు** బ్యాంకు వారికి అధికారం కలదు.

| క్ర. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం రూ. |
|---|---|---|---|---|
| 1 | 180374556987<br>180374557001<br>180374557055 | శ్రీ ఎస్.రఫీ, తండ్రి షేక్ అబ్దుల్లా, 20-28, గాంధీ నగర్, కార్వేటినగరం, పుత్తూరు, తిరుపతి - 517583 | 31.10<br>13.40<br>20.50 | 1,59,236.21<br>66446.25<br>102299.00 |

పుత్తూరు, తేది: 03.09.2025 — సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

# నేరాల నియంత్రణకు చర్యలు

**- శాంతి భద్రతలు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు**





గూడూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: నేరాల నియంత్రణకు చర్యలు చేపడతామని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్,గూడూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను, గూడూరు టూ టౌన్ పోలీసు స్టేషన్‌ను తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది చేస్తున్న డ్యూటీలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. గ్రేవ్ కేసులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకుని కేసులు చేదించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, సాయంత్రం సమయంలో పార్కులలో వాకింగ్ చేస్తున్న వృద్ధులతో ఇంట్రాక్ట్ అవుతూ వాళ్ల సమస్యలు తెలుసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పల్లెల్లో రాత్రి సమయంలో పల్లె ప్రజలతో ఇంట్రాక్ట్ అవుతూ ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. అదేవిధంగా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిన ప్రదేశాలను శుభ్రం చేసి అక్కడ పోలీస్ వారి హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి స్థావరాలపై ప్రత్యేకగా నిఘా పెట్టాలన్నారు. గంజాయి కేసులలో జైలుకు వెళ్లి బయటకు వచ్చిన వారిపై నిఘా పెట్టి నిరంతరం వారిని గమనిస్తూ ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. అర్ధరాత్రి సమయంలో బయట తిరుగుతున్న వారి వద్ద నుండి ఫింగర్ ప్రింట్స్ చెకింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. రాత్రి సమయంలో దొంగతనాలపై జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని అదేవిధంగా రాత్రి సమయంలో గస్తీ పెంచాలన్నారు.

వీలైనంత వరకు పోలీసు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటే ఎలాంటి సమస్యలు రావన్నారు. రౌడీ షీటర్ శ్రీకాంత్‌కు సంబంధించి తిరుపతి జిల్లాలో నేర సామ్రాజ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టమన్నారు. ఇప్పటికే కొంతమందిని అదుపులో తీసుకుని విచారిస్తున్నామన్నారు. పాత కేసులో సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని త్వరలో మిగతా వివరాలు కూడా వెల్లడిస్తానన్నారు. అదేవిధంగా త్వరలో జరిగే వెంకటగిరి జాతరకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. సూళ్ళూరుపేట లో జరిగిన కేసుకు సంబంధించి రీ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నమన్నారు. అదేవిధంగా గూడూరు సబ్ డివిజన్ సంబంధించి ప్రత్యేకంగా డ్రోన్లు కెమెరాలు ఇచ్చామన్నారు. ఈ డోన్ కెమెరాల తో నిరంతరము బీట్లు ఏర్పాటు చేసుకుని గూడూరు సబ్ డివిజన్లో అసంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ప్రాంతాల్లో పహారాకాస్తున్నామన్నారు. పోలీసుల బీట్ పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ పహారా బీట్లు గురించి అడిగి తెలుసుకుని, సక్రమంగా నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు చేపడతామన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ నేరాలు అరికట్టవచ్చుని అప్పుడే పోలీసులు ప్రజల మన్ననలు పొందుతామని సిబ్బందికి తెలిపారు. ఈయన వెంట గూడూరు డీఎస్పీ గీతా కుమారి, సిఐలు కిషోర్ బాబు, శేఖర్ బాబు, శ్రీనివాస్, ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పనులు చేయించుకున్నారు...పైసలివ్వలేదు!

## -తొండమనాడు చెరువు మరమ్మతుల కథ



శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఇరిగేషన్‌శాఖలు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు చెల్లింపుల్లేక తల్లడిల్లుతున్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లింపులు చేయక పనులు సగంలో వదలి పెట్టి వెళుతున్నారు. రైతులకు సంబంధించిన చెరువులు,స్వర్ణముఖి ఆధునీకరణకు జపాన్ నిధుల (జైకా)ను మంజూరు చేసింది. కానీ నిధులు విడుదల చేయకపోవటంతో స్వర్ణముఖి పనులు ప్రారంభం కాక పోగా తొండమనాడు చెరువు పనులు రూ.కోటి నిర్వహించి చెల్లింపుల్లేక వదలి పెట్టిన వైనం రైతులను కలవరపెడుతుంది.1999లో అప్పటి మంత్రి హోదాలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జన్మభూమిలో చెరువులను బాగు చేయించారు. తరువాత నిధుల కొరత శాపంగా వెంటాడుతుంది.

శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయ ప్రధాన ప్రాంతంగా ఉంది.ఇక్కడ వ్యసాయం స్వర్ణముఖి నదీ తీరాన అలాగే చెరువుల మీద ఆధారపడి సాగుతుంది.గత ప్రభుత్వంలో జపాన్ నిధులతో చేపట్టిన పనులకు నిధులు రాకుండా పెండింగ్ పడ్డాయి. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పనులను పరిశీలించిన తరువాత పనులుకొనసాగుటకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ నిధులతో రాష్ట్రంలోనే అతి పెద్ద చెరువు మైనర్‌ఇరిగేషన్ శాఖలో తొండమనాడు ఉంది. ఈ చెరువు నుంచి చుట్టుపక్కల ఏడు చెరువులకు సాగునీరందుతుంది. ఈ చెరువు ప్రధాన అవకాశంగా సుమారు 5వేల ఎకరాలకు సాగునీరందిస్తుంది.ఈ చెరువును 1999లో జన్మభూమి ప్రతిపాదించినపుడు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మైనర్ ఇరిగేషన్‌శాఖ మంత్రిగా ఉంటూ శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని చెరువులను ఆధునీకరించారు. ప్రస్తుతం ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి చెరువుల మరమ్మత్తులకు నిధుల కోసం సంబంధిత శాఖ మంత్రిచే నిధుల సాధనకు పరుగులు తీస్తున్నారు.

**తొండమనాడు చెరువు పనులు చేసి పైసల కోసం...**

శ్రీకాళహస్తి మండలంలోని అతి పెద్ద చెరువు తొండమ నాడు. ఈచెరువు కింద అధికారికంగా 1200 ఎకరాలకు సాగునీటితో పాటు చెర్లోపల్లి, ఊరందూరు, అరకొత్తూరు, కమ్మకొత్తూరు చెరువులకు సాగునీరందిస్తుంది.ఈ చెరువు మరమ్మతులకు 2023లో జపాన్ నిధులతో రూ.2.25 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను తిరుపతి చెందిన తిరుమల కన్‌స్ట్రక్షన్స్ వారు చేపట్టారు. సుమారు రూ.1.05 కోట్లు పనులు చేసారు.అయితే చెల్లింపులు రాలేదు.దాంతో పనులు చేపట్టలేదు.2024 జూన్ నాటికి కంట్రాక్టర్ పనులు నిలిపివేసారు.జైకా నిధులతో కాంట్రాక్టర్ కల్వర్టు,సప్లైఛానల్స్ 3వ తూము మరమ్మతులు చేపట్టారు. ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. మిగిలిన పనులను చేపడితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం రాబోవు వర్షాకాలం లోపల చెరువుల్లోంచి నీరు బయట వెళ్ళకుండా కాపాడుకొని గ్రామాల్లో ఒరెండు పంటలు పండించుటకు ప్రయత్నిస్తున్నారు. దాంతో ఇరిగేషన్ అధికారులను అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పరుగులు తీయిస్తున్నారు. అంతేకాక వర్షాలు కురుస్తున్నాయి కాబట్టి ఎక్కడైతే చెరువుల సమస్యగా ఉన్నాయో యుద్ధ ప్రతిపదికపై పనులు చేపట్టాని ఇరిగేషన్‌శాఖ అధికారులకు సూచించారు.

## బోయకొండ చైర్మన్ పదవి రేసులో బాలకుమార్

పుంగనూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: జిల్లాలో ప్రసిద్ధ శక్తి క్షేత్రంగా భాసిల్లుతున్న శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రేస్ లో పట్టణ బిజెపి సీనియర్ నాయకుడు, జిల్లా బిజెపి పోరు ప్రధాన కార్యదర్శి నాన బాలకుమార్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జిల్లాలో కూటమి నాయకులకు పదవుల పందేరం ప్రారంభమైన తరుణంలో చిత్తూరు జిల్లాలో బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పదవిని ఏ పార్టీకి కట్టబెట్టాలన్న నిర్ణయాన్ని కూటమి నాయకులు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ పదవి కోసం తెలుగుదేశం బిజెపి నాయకులు పోటాపోటీగా పోరాడుతున్నప్పటికీ, ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీకే చైర్మన్ పదవి కట్టబెట్టిన సందర్భాలు చాలా ఉన్నాయని బిజెపి పేర్కొంటోంది. జిల్లా స్థాయిలో పార్టీ నిర్మాణానికి, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి రెండు దశాబ్దాలుగా తాను అందించిన సేవలను దృష్టిలో ఉంచుకొని తనకు బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ పదవి అందించాలని పార్టీ సీనియర్ నాయకుడు నాన బాల లక్ష్మణ కుమార్ ఇప్పటికే పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేసి ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పదవి ప్రకటించే తరణం త్వరలో ఉండడంతో బిజెపి నుంచి నానబాల కుమార్ పేరును గట్టిగా నాయకులు ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆలయ కమిటీ సభ్యత్వం కోసం ఇప్పటికే దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏకాంబరంకు గతంలో కుమార్ దరఖాస్తు సమర్పించి ఉన్నారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులలో బిజెపికే కమిటీ చైర్మన్ పదవి ఇవ్వడం సమంజసమని కూటమి అభిప్రాయ పడుతున్నట్లు తెలుస్తోంది. నానబాల కుమార్ అభ్యర్థిత్వాన్ని బిజెపి నాయకులు సమర్ధిస్తూ ముఖ్యమంత్రి పేషీకి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

## బ్లాక్ ఫారెస్ట్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది

**తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష**



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: వి.యస్.ఆర్ క్రియేషన్స్ పథకంపై త్వరలో ప్రారంభం కానున్న సస్పెన్స్ కమర్షియల్ థ్రిల్లర్ బ్లాక్ ఫారెస్ట్ మూవీ స్క్రిప్ట్ పూజ కార్యక్రమం బుధవారం పుత్తూరు బైపాస్ రోడ్డు అంజారమ్మ కణం లో అంజారమ్మ దేవాలయం అమ్మవారి సన్నిధానంలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా క్లాప్ కొట్టి, టీమ్ సభ్యులను, ఆర్టిస్టులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నిర్మాత వి.యస్. రెడ్డి, సినిమా దర్శకుడు అనురాగ్ శివ, లీడ్ రోల్ ఆర్టిస్టులు శ్రావణి, తన్సియా, శ్రీలీల,సందీప్ లు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ బ్లాక్ ఫారెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్టు అవుతుందని, సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలో ఈ జోనర్ ఎవరు టచ్ చేయలేరని తెలియజేశారు. ఈ సినిమా ద్వారా దర్శకుడు అనురాగ శివ పెద్ద డైరెక్టర్ అవ్వాలని తెలిపారు. ఈ సినిమా ద్వారా నిర్మాత వి.యస్.రెడ్డి మంచి లాభాలు, మంచి సినిమాలు రావాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నాం. నిర్మాత మాట్లాడుతూ ఈ సినిమా షెడ్యూల్ త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. మా సినిమాకు తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష గారు పాల్గొనడం సంతోషంగా ఉందని తెలియజేశారు.

## గణనాధునికి సాంస్కృతిక నీరాజనం

**-హోరెత్తించిన సాంస్కృతిక కార్యక్రమాలు**





కాణిపాకం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన రథోత్సవం సందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. రథోత్సవం సందర్భంగా ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తుల కాలక్షేపం నిమిత్తం స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి అర్ధరాత్రి వరకు భక్తిరంజని, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను దేవస్థానం, ఉభయదారులచే ఏర్పాటు చేశారు. అలాగే రథోత్సవం ఊరేగింపు సందర్భంగా గ్రామ పురవీధులలో రాష్ట్రంలోనే పేరొందిన ప్రఖ్యాత కళాకారులచే వైవిధ్య భరితమైన సా ంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రథోత్సవం ముందు పదాతి దళాలు,విచిత్ర వేషదారణలు, రాజరిక వేషదారణ, డప్పు వాయిద్యం, కోలాటాలు, చెక్కభజనలు, పిల్లన గ్రోవి, డ్రమ్స్ వంటి పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాలు భక్తులను ఎంతో ఆకట్టుకోగా, ప్రదర్శనలతో కాణిపాకం హోరెత్తింది.

## ఆకట్టుకున్న ప్రత్యేకాలంకరణలు



కాణిపాకం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన రథోత్సవం సందర్భంగా ఆలయం వద్ద చేపట్టిన ప్రత్యేక అలంకరణలు భక్తులను విశేషంగా అలరించింది. రథోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రధాన ఆలయాన్ని వివిధ రకాల స్వదేశి, విదేశీజాతి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన ఆలయంలోని గర్భాలయం, అంత్రాలయం, అర్ధమండపం, సుపథమండపంలను వివిధరకాల పుష్పాలు, అరటి చెట్లు, మామిడి తోరణాలతో ఎంతో ఆకట్టుకునే విధంగా అలంకరించారు. అదేవిధంగా ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభానికి విదేశీ, స్వదేశీ జాతి పుష్పాలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దీనితో పాటు సుపథమండపంలో వివిధ రకాల ఫల, పుష్పాలు,గింజలతో ప్రత్యేకంగా తయారు చేసిన వినాయకుని ప్రతిమలు కూడా ఎంతో ఆకట్టుకున్నాయి. అలాగే ప్రధాన ఆలయాన్ని మొత్తం పూలతో అలంకరించడంతో ఆలయానికి ప్రత్యేక శోభ సంతరించకుంది.

## ద్వారకా తిరుమల తరపున పట్టువస్త్రసాల సమర్పణ



కాణిపాకం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్స వాలలో భాగంగా బుధవారం సిద్ధి, బుద్ధి సమేత స్వామి, అమ్మవార్లకు శ్రీద్వారకా తిరుమల దేవస్థానం తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రముఖ ఆలయాల నుండి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించడం గత కొన్నేళ్ళుగా ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు శ్రీద్వారకా తిరుమల దేవస్థానం తరపున ఆలయ ఈఓ ఎం.సత్య నారాయణ మూర్తి దంపతులు, ఆలయ అధికారులు, అర్చకులు బుధవారం ఉదయం కాణిపాకం ఆలయం చేరుకుని స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి పట్టువస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో కాణిపాకం, ద్వారకా తిరుమల దేవస్థానం ఏఈఓ రమణరాజు,అధికారులు, అర్చకులు, కాణిపాకం ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ధనుంజయ, ధనపాల్, ఎస్వీ,కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలు ఖాతరు చేయరా సారూ!



కుప్పం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసి కమిటీ తప్ప ఇతర రాజకీయ నాయకులు వెళ్లరాదని పాఠశాల ఆవరణల్లో ఎలాంటి ప్రైవేట్ కార్యక్రమాలకు అనుమతించరాదని సాక్షాత్తూ విద్యాశాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. అయితే ఈ నిబంధనలను ఓ ప్రధానోపాధ్యాయుడు పాటించక పాఠశాలలో ఓ కార్యక్రమంకు సంబంధించి వంట వార్పు చేసుకో వడంతో పాటు అక్కడే భోజనాలు చేసేందుకు అనుమతులిచ్చారు. మున్సిపల్ పరిధి సామగుట్టపల్లి యుపి స్కూల్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. యుపి పాఠశాల ఆవరణలో ఓ కార్యక్రమం కోసం హాజరయ్యే ప్రజలకు పాఠశాల ప్రాంగణంలోనే వంట చేసేందుకు అనుమతులు ఇవ్వడంతో పాటు షామియానా, కుర్చీల ఏర్పాటుతో పాటు అక్కడే భోజనాలు చేసేందుకు హెచ్‌ఎం అనుమతించినట్లు కొందరు గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో బుధవారం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. తరగతులు సైతం నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని పలువురు గ్రామస్తులు కోరారు.

## గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం



కాణిపాకం సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా బుధవారం జరిగిన రథోత్సవం అనంతరం గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. పగలు స్వామివారికి అంగరంగ వైభవంగా రథోత్సవం నిర్వహించారు. అనంతరం అలంకరించిన స్వామి అమ్మవార్ల ఉత్స వమూర్తులను రథం పైనుంచి కిందకు దించి ప్రత్యేక పల్లకిపై ఉంచి మంగళ వాయిద్యాలు నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. రథోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మహిళలచే కోలాటాల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో పెంచల కిషోర్ దంపతులు కోలాట బృందంతో కలిసి కోలాటాలు వేశారు. ఈ సంఘటన భక్తులను ఎంతో ఆకట్టుకుంది

## జ్వరంతో చిన్నారి మృతి!



చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: జ్వరం రావడంతో చికిత్స చేయించు కోవడానికి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఓ చిన్నారి బుధవారం మృతి చెందింది. ఈ మేరకు మృతి చెందిన చిన్నారి తండ్రి పురుషోత్తం చిత్తూరు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా వున్నాయి. చిత్తూరు ఖాజీ మున్సిపల్ పాఠశాలలో పి.నిసావాణి(8) 3వ తరగతి చదువుతోంది. ఆగస్టు 28వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు పాఠశాల నుండి ఇంటికి తిరిగి వస్తుండగా పి.నిసావాణి తనకు తలనొప్పి అని తండ్రి పురుషోత్తంకు చెప్పింది. ఈ మేరకు తండ్రి పురుషోత్తం కుమార్తె నిషావాణికి సమీపంలోని ఓ మెడికల్ షాపుకు వెళ్ళి మాత్రలు కొనుగోలు చేసి ఆమెతో మింగించాడు. గత నాలుగు రోజులుగా నిసావాణి పరిస్థితి మెరుగుకాకపోవడంతో ఆమెను ఆగస్టు 1వ తేదీ చికిత్స చేయించడానికి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళాడు. చిన్నారిని పరీక్షించిన వైద్యాధికారి ఆమెను పరీక్షించి తదుపరి చికిత్స చేయడానికి ఆసుపత్రిలో అడ్మిట్ చేశాడు. వైద్యుల సంరక్షణలో వున్నప్పటికీ ఆ చిన్నారి పరిస్థితిలో మార్పు లేకపోవడంతో బుధవారం ఉదయం తీవ్ర జ్వరం, తలనొప్పితో నిసావాణి ఆసుపత్రిలో మృతి చెందింది. తన కుమార్తె మృతికి కారణాలు వెల్లడించడానికి విచారణ చేపట్టాలని తండ్రి పురుషోత్తం టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్యను కలిసి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లాలో నలుగురు ఎస్ఐలు బదిలీలు

చిత్తూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: జిల్లాలో నలుగు ఎస్.ఐలను బదిలీచేస్తూ జిల్లా ఎస్పి మణికంఠచందోలు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వన్‌టౌన్ అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ టి.శ్రీనివాసులును జిల్లా పోలీసు శిక్షణా కేంద్రానికి, విఆర్‌లో వున్న బి.నాగప్ప నాయక్‌ను చిత్తూరు వన్‌టౌన్ అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు, విఆర్‌లో వున్న మహమ్మద్ ఇషాఫ్ పలమనేరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు, అలాగే ప్రస్తుతం విఆర్‌లో వున్న వి.త్యాగరాజులను చిత్తూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేసన్ ఎస్.ఐగా బదిలీ చేశారు.

# గూడూరు డివిజన్

## అలలు తాకిడికి యువకుడు మృతి!

కోట,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: కోట మండలం కొత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాస్‌సత్రం సముద్రంలో అలలు తాకిడికి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మనుబోలు మండలం పిడూరు గ్రామానికి చెందిన యశ్వంత్ (22) తో పాటు మరి కొందరు గణేష్ నిమజ్జనం సందర్భంగా వినాయక విగ్రహంను నిమజ్జనం చేసేందుకు శ్రీనివాస్‌సత్రం వద్దకు చేరుకొన్నారు. నిమజ్జనం చేసే క్రమంలో ఒక్క సారిగా అలలు తాకిడికి యశ్వంత్ మృతి చెందారు. ఆమేరకు మృత దేహాన్ని పిడూరుకు తరలించారు.

## పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటాం : రామ్‌కుమార్



వెంకటగిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: గత రెండు రోజుల క్రితం వెంకటగిరి పట్టణం గొప్పపురానికి చెందిన వైసీపీ నాయకుడు ఆవుల ఓబయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులను వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఓబయ్య చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, పట్టణ కన్వీనర్ ప్రసాద్ రెడ్డి, నాయకులు మురళీకృష్ణ, రాజారెడ్డి, దశరథ రామ్ రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ హర్షవర్ధన రాజు



వెంకటగిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో ఎస్పి రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలుపై డిఎస్పి గీత, సిఐ ఏవి రమణలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు పనిచేయని పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ ఏడుకొండలు సిబ్బంది ఉన్నారు.

## అంగనవాడి కేంద్రాలను సందర్శనలు చేసిన ఐసిడిఎస్ పిడి



గూడూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: గూడూరు అర్బన్, చిల్లకూరు మండల పరిధిలోని పలు అంగనవాడి కేంద్రాలను, గూడూరు అర్బన్ ఐసిడిఎస్ కార్యాలయం, బాలసదనంలలో తిరుపతి జిల్లా ఐసిడిఎస్ పిడి వసంతబాయి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ముఖ్యంగా ఐసిడిఎస్ పి డి చిల్లకూరు మండల పరిధిలోని చింతవరం లోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి విద్యార్థులతో మాటామంతి జరిపారు. అనంతరం గూడూరు పట్టణంలోని అర్బన్ ఐసిడిఎస్ కార్యాలయం, రెండో పట్టణంలో ఉన్న బాల సదనంను సందర్శించారు. పిడి వెంట గూడూరు అర్బన్ ఐసి డిఎస్ సిడిపిఓ మెహబూబీ, నోడల్ ఆఫీసర్, తదితరులు ఉన్నారు.

## బడి ఇక్కడ... పిల్లలు ఎక్కడ!




దొరవారి సత్రం,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండల పరిధిలోని తుంగమడుగు గ్రామంలో నాటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి నాడు నేడు ప్రోగ్రాంలో తుంగమడుగు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నేడు శిథిలావస్థకు చేరినది. దొరవారిసత్రం మండలం తుంగమడుగు గ్రామంలో దాదాపు 500మంది జనాభా కలిగిన గ్రామం నాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉండేది నేడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంవల్ల ఆ గ్రామంలో నాడు చదువుకోవడం కోసం ప్రక్క మండలాలకు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆనాటి ప్రభుత్వం లక్షలు ఖర్చుపెట్టి పాఠశాలను తీర్చిదిద్దగా నేడు ఆ పాఠశాల పరిస్థితి దీనస్థితి చేరుకోవడంపై ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇకనైనా ఇటు వంటి పాఠశాలను గుర్తించి ఎక్కడ పిల్లలను అక్కడే ఉంచాలని ఆ గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## పోలేరమ్మ జాతర కోసం రూ.40 లక్షల నిధులు విడుదల



వెంకటగిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: దక్షిణ భారత దేశ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవం రాష్ట్ర పండుగలా ఘనంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో 40 లక్షల సిజిఎఫ్ నిధులను మంజూరు చేయించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ జాతరను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి భక్తులు మనో భావాలకు మరింత పెద్దపీట వేసింది.స్థానిక వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో పోలేరమ్మ జాతర విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక చొరవతో 40 లక్షల నిధులు మంజూరు చేశారు. గత ఏడాది పోలేరమ్మ జాతర కు 30 లక్షలు విడుదల కాగా,ఈ ఏడాది అదనంగా మరో పది లక్షలు కేటాయించి 40 లక్షలు రూపాయలు జమ చేయడం జరిగింది.

## ఉపాధ్యాయులకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే




గూడూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రాంగణం నందు గత కొద్ది రోజుల నుండి జరిగిన టీచర్స్ క్రికెట్ లీగ్ నిర్వహించారు. ఈ టీచర్స్ క్రికెట్ లీగ్‌లో గెలుపొందిన వారికి బహుమతులు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందించారు.

**పుత్తూరు ప్రభుత్వాస్పత్రి స్థాయి...**

## 100 పడకలుగా పెంపు

పుత్తూరు, సెప్టెంబరు 3 ప్రభాతవార్త : పుత్తూరు ప్రభుత్వాస్పత్రిని ప్రస్తుతం వున్న 30 పడకల నుంచి 100 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంపును కోరుతూ గత నెల 11వ తేదీన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ముఖ్యమంత్రికి చేసిన రాత పూర్వక విజ్ఞప్తిని పరిగణనలోనికి తీసుకుని ఈ నెల 2వ తేదీన ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఆ లేఖ సారాంశాన్ని రాతపూర్వకంగా తెలియజేశారు. చుట్టుపక్కల 9 మండలాల నుంచి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రతి రోజు 500 మంది వరకూ ఔట్ పేషెంట్లు, 60 మంది వరకూ ఇన్‌పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని ఆ లేఖలో తెలిపారు. ఆస్పత్రిలో నవ జాత సంరక్షణ యూనిట్ (న్యూబార్న్ స్టెబిలైజేషన్ యూనిట్), రక్త నిల్వ కేంద్రం, హోమియో డిస్పెన్సరీ, హార్ట్ ట్రీట్మెంట్ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిని 30 పడకల నుంచి 100 పడకల స్థాయికి పెంచాలని దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు 2017లోనే కోరారని, ఆ మేరకు అప్పట్లో వైద్య శాఖ కమిషనర్ ఆ అంశాన్ని పరిశీలన చేశారని తెలిపారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ఒక నెల రోజుల్లోగా ఈ అంశాన్ని పరిశీలనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సిఎం కార్యాలయం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. తీసుకున్న చర్యలను పిఆర్‌జిఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో కూడా నమోదు చేయాలని తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో మహిళలకే పెద్దపీట

**- మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే**



చిత్తూరురూరల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు పెద్దపీట వేస్తున్నారని, అన్నిరంగాల్లో మహిళలు రాణించాలన్నదే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ముందుగా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పిసిఆర్ కూడలిలోని స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి కట్టమంచిలోని మార్కెట్ యార్డు సభా వేదిక వద్దకు ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వైయ్యాసి ఝాన్సీ వెంకటేష్‌యాదవ్, వైస్‌చైర్మన్‌గా అనురాధ, మరో 18మంది కమిటీ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందనీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి రైతులకు ఉపయోగకరంగా మార్చాలనే లక్ష్యంతో నూతన కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, తిరుపతి తెదేపా అధ్యక్షులు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే మనోహర్, సింగిల్‌విండో అధ్యక్షులు ప్రతాప్‌నాయుడు, నీరజాక్షులు, టౌన్‌బ్యాంక్ చైర్మెన్ రమేష్‌నాయుడు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ త్యాగరాజులు, తెదేపా, భాజనా, జనసేన నాయకులు చంద్రప్రకాష్, అరుణ, కోదండయాదవ్, అట్లూరిశ్రీనివాసులు, ఆరణి కవిత, మండల, నగర అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.